

- పేద కుటుంబాల్లో మద్యం చిచ్చు
- నిషేధం ఊసే మరిచిన ప్రభుత్వం
- మద్యానికి బానిసై ప్రాణాలు కోల్పోతున్న ప్రజలు

మద్యం మహమ్మారి నిండుప్రాణాలను బలిగొంటోంది. భార్యాభర్తలు, తండ్రీకొడుకుల మధ్య గొడవలు సృష్టిస్తోంది. ఈ మత్తు ఎన్నో అఘాయిత్యాలకు కారణమవుతోంది. మద్యం వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలు ఆర్థికంగా ఛిద్రమవుతున్నాయి.. కూలికెళితే గాని కుండకాలే కుటుంబాల్లో మద్యం చిచ్చు రేపుతోంది. మద్యం ధరలు అమాంతం పెంచడంతో రోజు కూలీలు తమకు వచ్చే కూలి డబ్బులో సగం మద్యానికే ఖర్చుచేసినా కిక్కు ఎక్కడం లేదని పేర్కొంటున్నారు. ఎక్కువగా నాసిరకం మందు అమ్ముతున్నారని, దీంతో ఆరోగ్యం పాడవుతోందని మందుబాబులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మత్తుకు చిత్తై.. బతుకు ఛిద్రమై..

సుండుపల్లె, మార్చి 1: 'అధికారంలోకి వస్తే దశల వారీగా సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేస్తాం. స్టార్ హోటల్‌లో మినహా ఎక్కడా మద్యం దొరకకుండా చేస్తాం. అక్కాచెల్లెమ్మల కుటుంబాల్లో చిచ్చు పెడుతున్న మద్యాన్ని నిషేధిస్తాం.'... గత సార్వత్రిక ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నేత హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన ప్రకటన ఇది. తీరా అధికారంలోకి వచ్చాక మద్యాన్ని నియంత్రించకపోగా విక్రయాలను ప్రభుత్వ నియంత్రణలోకి తీసుకొని ఆదాయ వనరుగా మార్చుకున్నారు. తొలుత దుకాణాల సంఖ్యను తగ్గించి ధరలను పెంచడంతో ఖజానాకు దిగుబడి తగ్గింది. దీంతో ధరలను తగ్గించి విక్రయాలు పెంచుకున్నారు. ధరలు పెంచితే మద్యం తాగరని ప్రజలను మోసం చేసేందుకు మద్యం ధరలు భారీగా పెంచి మధ్య తరగతి ప్రజల నడ్డి విరుస్తున్నారని కొంత మంది మందుబాబులు చెబుతున్నారు. మద్యం కారణంగా పచ్చని కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నా.. మత్తులో అఘాయిత్యాలకు పాల్పడుతున్నా.. ప్రభుత్వానికి పట్టింపు లేకుండా పోయిందనే విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. సుండుపల్లె మండల కేంద్రంలో రెండు మద్యం దుకాణాలను ప్రభుత్వం నడుపుతోంది. మారుమూల మండలం కావడంతో రోజు వారి కూలీలు పనులకు వెళ్లి కుటుంబాలను పోషించుకుని జీవనం సాగిస్తున్నారు. మద్యానికి బానిసైన వారు రోజు వారి కూలి డబ్బును మద్యానికి వెచ్చించి కుటుంబాలను నాశనం చేసుకుంటున్నారని స్పష్టంగా తెలుస్తోంది. 14 గ్రామ పంచాయతీలతో సుమారు 260 పైచిలుకు పల్లెలు ఉన్నాయి. అన్ని పల్లెల్లో మద్యానికి బానిసైన వ్యక్తులు ఉన్నారు. మద్యం షాపుల నుంచి భారీగా మద్యాన్ని పల్లెలకు తరలి స్తున్నారు అనే విమర్శలు జోరుగా వస్తున్నాయి. అన్ని నాసిరకం మందులను మండలానికి తరలిస్తున్నారని కొంత మంది వాపోతున్నారు.

మద్యం సరఫరా చేస్తే కఠిన చర్యలు..

మద్యం సరఫరా చేసినా, అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటాం. పల్లెల్లో బెల్ట్‌షాపులు నిర్వహించిన వారిపై తప్పకుండా కేసులు పెడతాం. నాటుసారా తయారీ మండలంలో లేదు. బయట ప్రాంతాల నుంచి తీసుకువచ్చి అమ్ముతున్నట్లు సమాచారం ఉంది. వారిని అరెస్టు చేసి జైలుకు పంపిస్తాం. 14 గ్రామ పంచాయతీల్లో మద్యం అమ్మకాలు, తయారీపై నిఘా ఏర్పాటు చేస్తాం.

- ఎస్‌కేఎం హుస్సేన్, ఎస్ఐ, సుండుపల్లె

ప్రతిరోజు రూ.6 లక్షలకుపైన అమ్మకాలు

మండల కేంద్రంలో రెండు మద్యం దుకాణాలను ప్రభుత్వం నడుపుతోంది. ఈ దుకాణాల నుంచి పల్లెలకు నిరంతరం మద్యం సరఫరా అవుతున్నా ఎక్సైజ్ అధికారులు కానీ, పోలీసు అధికారులు కానీ పట్టించుకున్న పాపాన పోవడం లేదని విమర్శలున్నాయి. రెండు దుకాణాల నుంచి ప్రతిరోజు రూ.6 లక్షల వరకు మద్యం అమ్మకాలు జరుపుతున్నారు. ప్రభుత్వం బెల్టు షాపుల నుంచి పల్లెలకు మద్యం సరఫరా కావడంతో ఓ వైపు నాటుసారా మరోవైపు ఇంగ్లీష్ మందు తాగి ప్రజలు ప్రాణాలు కోల్పోవాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. ప్రతియేటా 25 శాతం దుకాణాలను తగ్గించి నాలుగేళ్లలో సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేస్తామని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ అమలు కాకపోగా ప్రభుత్వమే మద్యం సరఫరా చేయడం విడ్డూరంగా ఉందని, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని విమర్శలు గుప్పుమంటున్నాయి.

సుండుపల్లెలో 2019 నుంచి 35 కేసులే...

మండలంలో బ్రాందీ, నాటుసారా ఏరులై పారుతున్నా అరకొర కేసులతో అధికారులు చేతులు దులుపుకుంటున్నారని, పల్లెల్లో మద్యం అమ్మకాలపై కఠిన చర్యలు తీసుకుంటే మద్య నిషేధం అమలు చేయవచ్చునని బాధిత కుటుంబాలు పేర్కొంటున్నాయి. 2019 సంవత్సరం నుంచి 2024 ఫిబ్రవరి రెండో తారీఖు వరకు మండలంలో ఇంగ్లీష్ మద్యం అమ్మకాలపై కేవలం 35 కేసుల్లో 38 మందిపై మాత్రమే కేసులు నమోదయ్యాయి. అలాగే నాటుసారా అమ్మకాలపై 90 కేసుల్లో 123 మందిపై కేసులు నమోదయ్యాయి. 2020 సంవత్సరం నుంచి ప్రభుత్వమే బెల్ట్ షాపులు నిర్వహించడం ప్రారంభించడంతో ఆ సంవత్సరంలో ఒక్క కేసు కూడా సుండుపల్లె స్టేషన్‌లో నమోదు కాలేదు. దీన్నిబట్టి చూస్తే ప్రభుత్వమే మద్యం అమ్ముతుండటంతో అధికారులు సైతం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి.

ప్రభుత్వ మద్యం అమ్మకాలకు నిండు ప్రాణాలు బలి

సుండుపల్లె మండలం మాచిరెడ్డిగారిపల్లె గ్రామ పంచాయతీకి చెందిన హరినాయక్ (24) సంవత్సరాల యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. గత నాలుగు సంవత్సరాల నుంచి విపరీతంగా మద్యానికి బానిసయ్యాడు. మద్యానికి డబ్బు ఇవ్వకపోవడంతో ఇంట్లో తల్లితో గొడవపడి ఉరివేసుకొని మృతి చెందాడు. దీంతో కుటుంబానికి ఆవేదన మిగిల్చి వెళ్లిపోయాడు. మండల కేంద్రంలో ఆనంద్‌నగర్‌కు వెళ్లే రహదారిపై రాత్రివేళ ఇద్దరు వ్యక్తులు 2023 డిసెంబరు 10వ తేదీన రాత్రి మద్యం తాగి ఒకరిపై ఒకరు దాడి చేసు కున్నారు. మత్తులో ఓ వ్యక్తి మద్యం సీసాతో తలపై బలంగా కొట్టడంతో దూది హరిజనవాడకు చెందిన వెంకటేశ్ (35) అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. ఈ వ్యక్తికి ముగ్గురు కుమారులు, నలుగురు కుమార్తె, భార్య ఉన్నారు. ఆ కుటుంబం మద్యం కారణంగా వీధిపాలైంది. ఈ విధంగా మద్యం మత్తులో అనేక కుటుంబాలు ఛిద్రం అయ్యాయి. కొంత మంది మంచానపడి లేవలేని స్థితిలో జీవనం సాగిస్తున్నారు.


సుండుపల్లెలో ఓ మద్యం షాపు

మద్య నిషేధం చేసి ఓట్లు అడుగుతారా..



2024 సార్వత్రిక ఎన్నికలకు మద్య నిషేధం చేసిన తరువాతే ఓట్లు అడుగుతానని సీఎం చెప్పారు. సార్వత్రిక ఎన్నికలకు సమయం ఆసన్నమైంది. మరి మద్యనిషేధం చేసే వైసీపీ ఎమ్మెల్యేలు, నాయకులు ఓట్లు అడుగుతారా? కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలు తీస్తున్నారు. మద్యం రేట్లు పెంచి మధ్యతరగతి కుటుంబాలను నాశనం చేస్తున్నారు. ఇచ్చిన హామీ నెరవేర్చకుండా ఏ మొహం పెట్టుకొని ఓట్లు అడుగుతారు? మద్య నిషేధం చేయకుండా ఎన్నికలకు వస్తే ప్రజలు వైసీపీని నమ్మరు.

- రెడ్డిరాణి, జనసేన మహిళా అధ్యక్షురాలు

మద్యానికి బానిసై.. నా తమ్ముడు చనిపోయాడు..



మద్యానికి బానిసై నా తమ్ముడు ప్రాణాలు కోల్పోయాడు. నాలుగు సంవత్సరాలుగా మద్యానికి బానిసయ్యాడు. విచ్చలవిడిగా మద్యం దొరకడం వలన మద్యం సేవించేవాడు. మాన్పించాలని ఎంత ప్రయత్నించినా కుదరలేదు. ఒకసారి ఈ మద్యానికి బానిసైతే ప్రాణాలు కోల్పోవడం తప్ప మరో మార్గం లేదు. చిన్న వయసులో నా తమ్ముడు చనిపోవడం మా కుటుంబంలో తీరని విషాదాన్ని మిగిల్చింది. మద్యనిషేధం చేసి ఉంటే బాగుండేది.

- బాలరాజానాయక్, పెద్దబిడికి

ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు

- కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

రాయచోటి(కలెక్టరేట్), మార్చి 1: త్వరలో జరగబోవు 2024 సాధారణ ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారికి వివరించారు. శుక్రవారం ఎన్నికల నిర్వహణకు సంబంధించి పెండింగ్ ఫామ్స్ పరిష్కారం, మీడియా రిపోర్టులపై చర్యలు, ఓటరు కార్డు జనరేషన్, ప్రింటింగ్ పంపిణీ, వివిధ అంశాల్లో సిబ్బందికి ఎన్నికల శిక్షణా తరగతుల నిర్వహణ, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్, ఎన్నికల జిల్లా కంట్రోల్ రూమ్ ఏర్పాటు, ఇతర అంశాల్లో పూర్తి చేయాల్సిన ముందస్తు ఏర్పాట్లపై రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఎంకే మీనా జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు. వీసీ అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇంకనూ పరిష్కరించాల్సిన 13 వేల ఫామ్స్‌ను త్వరగా పరిశీలన చేసి వెంటనే సీఈవో కార్యాలయానికి నివేదిక పంపాలన్నారు. నూతనంగా ప్రింట్ అయిన ఓటరు కార్డులను పోస్టల్ శాఖతో సమన్వయం చేసుకొని సంబంధితులకు అందేలా తగిన పర్యవేక్షణ చేయాలని అధికారులకు సూచించారు. రాజకీయ పార్టీలకు, మీడియా వారికి కూడా ఎన్నికలకు సంబంధించిన అంశంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటుకు షెడ్యూల్ రూపొందించాలని పేర్కొన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్‌వో సత్యనారాయణరావు, ఎన్నికల నోడల్ అధికారులు, ఎన్నికల విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీ- విజిల్ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోండి

భారతదేశ ఎన్నికల సంఘం రూపొందించిన సీ-విజిల్ తదితర యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్‌కిశోర్ జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. సామాజిక మాధ్యమాలు, భారతదేశ ఎన్నికల సంఘం రూపొందించిన సీ-విజిల్, నోయువర్ కాండిడేట్, ఓటర్ హెల్ప్‌లైన్, సాక్ష్యం వంటి యాప్‌లను గూగుల్ ప్లే స్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. సాధారణ ఎన్నికలు- 2024కు సంబంధించి సమాచారం, ఫిర్యాదులు చేయవచ్చన్నారు.

పేదరికంతో చదువుకు దూరం కాకూడదు

- కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ ● రూ.24.80 కోట్ల విద్యాదీవెన నిధులు జమ


జగనన్న విద్యాదీవెన చెక్కును అందజేస్తున్న కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

రాయచోటి(కలెక్టర్), మార్చి 1: పేదరికంతో విద్యార్థులు చదువుకు దూరం కాకూడదనే ప్రభుత్వం జగనన్న విద్యాదీవెన పథకాన్ని అమలు చేయడం జరిగిందని కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ పేర్కొన్నారు. శుక్రవారం కృష్ణా జిల్లా పామర్రు నుంచి జగనన్న విద్యాదీవెన పథకం కింద అక్టోబరు, డిసెంబరు-2023 త్రైమాసికానికి సంబంధించి పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, బటన్ నొక్కి తల్లులు, విద్యార్థుల జాయింట్ ఖాతాల్లో నేరుగా జమ చేశారు. రాయచోటి కలెక్టరేట్ వీసీ హాలు నుంచి కలెక్టర్ అభిషిక్త్‌కిశోర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, సోషల్ వెల్ఫేర్ డీడీ జాకీర్‌హుస్సేన్, బీసీ సంక్షేమశాఖ అధికారి సందప్ప తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశ చరిత్రలోనే తొలిసారిగా పూర్తి స్థాయి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రభుత్వం అమలు చేయడం విద్యార్థుల అదృష్టమని, ప్రతి విద్యార్థి బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ప్రభుత్వ విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడం ప్రతిఒక్కరూ ఎంతో గర్వించదగ్గ విషయమన్నారు. జగనన్న విద్యాదీవెన పథకం ద్వారా ఐటీఐ, డిప్లమా, డిగ్రీ, ఆపై స్థాయి ఉన్నత విద్యను అభ్యసిస్తున్న ప్రతి విద్యార్థికి ఈ పథకం ఒక వరం లాంటిదన్నారు. నాడు- నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి జరిగినట్లు తెలిపారు. సీఎం వీసీ అనంతరం జగనన్న విద్యా దీవెన పథకం కింద అక్టోబరు, డిసెంబరు-2023 త్రైమాసికానికి సంబంధించి జిల్లా వ్యాప్తంగా అర్హులైన 31,478 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.24,80,81,198 మెగా చెక్కును విద్యార్థుల తల్లులకు కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ శాఖ, విద్యాశాఖ అధికారులు, జిల్లాలోని పలు డిగ్రీ, ఇంజనీరింగ్ ఇతర ప్రొఫెషనల్ కోర్సుల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

'ఓట్ల పట్టుచీరలు'పై కలెక్టర్ సీరియస్

- విచారించి నివేదిక అందించాలని పీలేరు అధికారులకు ఆదేశాలు
- వలంటీర్ల ప్రమేయంపై దృష్టి సారించాలని సూచన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


పీలేరు పట్టణం ఆర్టీసీ నల్లగుట్టలో శుక్రవారం చీరలు పంచుతున్న వైసీపీ శ్రేణులు

పీలేరు, మార్చి 1: ఓటర్లను ప్రలోభ పరుచుకునేందుకు పీలేరు వైసీపీ నాయకులు తలపెట్టిన చీరల పంపిణీ వ్యవహారంపై కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ సీరియస్ అయినట్లు తెలిసింది. ఆ తంతుపై విచారణ జరిపి తనకు వెంటనే నివేదిక అందించాలని పీలేరు రెవెన్యూ అధికారులను ఆదేశించినట్లు సమాచారం. కలెక్టర్ ఆదేశాలతో స్థానిక ఆర్ఐ, వీఆర్వోలు శుక్రవారం పీలేరు పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించి విచారణ ప్రారంభించారు. ఎన్నికల నగారా మోగక ముందే పీలేరు వైసీపీ నాయకులు ఓటర్లను ఆకర్షించేందుకు గురువారం నుంచి తాయిలాల పంపిణీ చేపట్టిన విషయం తెలిసిందే. 'ఓట్ల పట్టుచీరలు' అన్న శీర్షికన ఆంధ్రజ్యోతిలో శుక్రవారం కథనం వెలువడిన విషయం పాఠకులకు తెలిసిందే. పీలేరు 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి ప్రారంభోత్సవం కోసం తాను పీలేరులో ఉన్నప్పుడే చీరల పంపిణీ జరిగిందన్న విషయం తెలుసుకుని కలెక్టర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న ఆయన ఆంధ్రజ్యోతిలో వచ్చిన విధంగా పీలేరు పట్టణంలో ఎక్కడెక్కడ చీరల పంపిణీ జరిగిందో సవివరంగా విచారించి తనకు నివేదిక అందజేయాలని శుక్రవారం మధ్యాహ్నం తహసీల్దారు మహబూబ్‌బాషాను ఆదేశించినట్లు సమాచారం. చీరల పంపిణీలో వలంటీర్ల ప్రమేయం ఉన్నదా, పంపిణీలో వారు పాల్గొన్నారా, పాల్గొని ఉంటే ఎవరెవరు, ఎక్కడెక్కడ పాల్గొన్నారనే అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి తనకు తెలియజేయాలని ఆయన ఆదేశించినట్లు తెలిసింది. ఆయన ఆదేశాల మేరకు తహసీల్దారు మహబూబ్ బాషా, ఆర్ఐ చాణక్య నేతృత్వంలో బృందాలను ఏర్పాటు చేసి శుక్రవారం పీలేరు పట్టణంలో సమగ్రంగా విచారణ చేపట్టినట్లు విశ్వసనీయ సమాచారం.

వలంటీర్లలో టెన్షన్.. టెన్షన్..

చీరల పంపిణీపై కలెక్టర్ విచారణకు ఆదేశించిన సంగతి బహిర్గతం కావడంతో పీలేరు పట్టణంలోని పలువురు వలంటీర్లలో టెన్షన్ మొదలైంది. చీరల పంపిణీలో ఆయా ప్రాంతాల్లోని వలంటీర్లు కీలకంగా వ్యవహరించారు. వలంటీర్ల ద్వారానే వైసీపీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి చీరలు అందజేశారు. కొంత మంది వలంటీర్లు ఒక అడుగు ముందుకు వేసి తాము తమ ప్రాంతాల్లో చీరల పంపిణీ ప్రారంభించామని, పూర్తి చేశామని తమ వ్యాట్సప్‌లలో స్టేటస్‌లు కూడా పెట్టుకున్నారు. వారందరూ శుక్రవారం మధ్యాహ్నం నుంచి వాటిని తొలగించినట్లు తెలిసింది. ఎన్నికల కోడ్ అమలులో లేనందువల్ల తమకేమీ కాదని ధైర్యంగా ఉన్న వారు, కలెక్టర్ సీరియస్ కావడంతో ఖంగుతిన్నారు. అయితే పీలేరు పట్టణంలో చీరల పంపిణీ కార్యక్రమం రెండవ రోజైన శుక్రవారం కూడా కొనసాగింది. ఎవరేమనుకున్నా తమకు పట్టదన్నట్లు వైసీపీ శ్రేణులు తమ ప్రాంతాల్లో చీరల పంపిణీని కొనసాగించారు.

టీడీపీ పోస్టర్లపై రంగేశారు

- చర్యలు తీసుకోవాలంటూ ఎస్పీకి ఎమ్మెల్సీ ఫిర్యాదు


తొండూరులో టీడీపీ అంటించిన పోస్టర్‌పై రంగు వేసిన దృశ్యం


కడప (క్రైం), మార్చి 1: పులివెందుల నియోజకవర్గంలో అంటించిన వాల్‌పోస్టర్లపై రంగు వేశారని, దీనిపై విచారణ జరిపి బాధ్యులపై కేసు నమోదు చేయాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్‌కు ఫిర్యాదు చేశారు. టీడీపీ మేనిఫెస్టోలో ఉన్న విషయాలను ప్రజలకు తెలియజెప్పాలని వాల్‌పోస్టర్లు ముద్రించి వివిధ ప్రాంతాల్లో గోడలకు అంటించామన్నారు. గురువారం రాత్రి కొందరు దుండగులు వాటిపైన రంగు పూశారన్నారు. తొండూరు, పార్నపల్లి, పైడిపాలెం తదితర రహదారుల్లో ఉన్న వాటిని చెడగొట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇవన్నీ కూడా సీసీ కెమెరాలో ఉన్న ప్రాంతాల్లోనే చేశారని, వీటిని పరిశీలిస్తే నిందితులను గుర్తించవచ్చన్నారు. ఎన్నికల ముందు ఇలాంటి ఘటనలు శాంతికి విఘాతం కలిగిస్తాయన్నారు. ఈ చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరారు.

- ఓటర్ల జాబితాపై సర్వత్రా విమర్శలు..


136వ పోలింగ్ స్టేషన్ ఓటరు జాబితాలో తొలగించని మృతుల ఓట్లు

తప్పుల తడక సరిచేసేదేన్నడో..!

వాల్మీకిపురం, మార్చి 1: మరో పదిహేను రోజుల్లో ఎన్నికల రోడ్ వస్తున్న నేపథ్యంలో సమగ్ర ఓటర్ల జాబితా ఇప్పటి దాకా సిద్ధం చేయలేకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు చోటు చేసుకుంటున్నాయి. వాల్మీకిపురం మండల వ్యాప్తంగా వందల సంఖ్యలో తొలగించాల్సిన ఓట్లు అధికారులు నిర్లక్ష్యంగా అలాగే వదిలేశారని పలువురు ప్రతిపక్ష పార్టీల నాయకులు ఆరోపిస్తున్నారు. గత ఒకటిన్నర నెల కాలంగా పలుమార్లు అభ్యంతరాలు, చేర్పులు, తొలగింపులు తదితర వాటిపై స్థానిక అధికారులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినా పట్టించుకులేదని విమర్శిస్తున్నారు. మచ్చుకు వాల్మీకిపురం పట్టణంలో ఓటర్ల జాబితా పరిశీలిస్తే ఎన్ని తప్పులు దర్శనమిస్తున్నాయో చూడండి. పట్టణ 136వ పోలింగ్ స్టేషన్ పరిధిలోని ఓటర్ల జాబితాలో ఏకంగా 76, 77 వరుస నెంబర్లతో చనిపోయిన ఓ మహిళా ఓటర్లు పేరు అలాగే ఉండటం, వరుస నెంబర్ 349కి సంబంధించిన ఓటరు వివరాలు హిందీలో ఉండటం గమనార్హం. అలాగే అదే బూత్‌కు సంబంధించి ఇంటి నెంబర్9-148తో వరుసగా ముగ్గురికి ఓట్లు ఉన్నాయి. అంతేకాకుండా సుమారు 11 మందికి పైగా మృతి చెందిన వ్యక్తుల పేర్లు అలాగే ఓటరు జాబితాలో కొనసాగుతున్నాయి. ఇలా పట్టణంలోని ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో తప్పులు దొర్లుతున్నా సంబంధిత అధికారులు చొరవ చూపి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ఎన్నికల కోడ్ వచ్చే నాటికైనా ఓటర్ల జాబితా సరిదిద్ది సమగ్ర ఓటరు జాబితా సిద్ధం చేయాలని, లేనిపక్షంలో నేరుగా ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని ప్రతిపక్ష పార్టీల నాయకులు హెచ్చరిస్తున్నారు.



వాల్మీకిపురం 136వ పోలింగ్ స్టేషన్ పరిధిలోని జాబితాలో హిందీలో ఉన్న ఓటరు వివరాలు

సమగ్ర జాబితా సిద్ధం చేస్తాం..

ఎన్నికల నామినేషన్‌కు ముందుకు వచ్చే ఓటర్ల జాబితా సమగ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. మండల పరిధిలోని ప్రతి పోలింగ్ స్టేషన్‌కు సంబంధించిన ఓటర్ల జాబితాలో మృతులు, డబుల్ ఎంట్రీల తొలగింపులు, తప్పుల సవరణలు, చేర్పులు ప్రతిదీ సమగ్రంగా జాబితా సిద్ధం చేసి ఎలాంటి పొరపాట్లకు చోటు లేకుండా చర్యలు చేపడుతున్నాం.

-షేక్ ఖతిజున్ కుబ్రా, తహసీల్దార్, వాల్మీకిపురం


వాల్మీకిపురం పట్టణంలోని ఓటరు జాబితాలో మృతురాలి పేరు తొలగించకపోగా వరుస నెంబర్లతో పక్కపక్కనే ఉన్న దృశ్యం


వాల్మీకిపురంలోని 136పోలింగ్ స్టేషన్ పరిధిలో ఒకే ఇంటి నెంబర్‌తో ముగ్గురు ఓటర్లు ఉన్న దృశ్యం

జిల్లాలో ప్రశాంతంగా ఇంటర్మీడియట్ పరీక్షలు



రాయచోటిలో పరీక్షా కేంద్రం వద్ద వేచి ఉన్న విద్యార్థులు

రాయచోటిటౌన్, మార్చి 1: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నుంచి ప్రారంభమైన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులు ఏర్పాటు చేసిన 54 పరీక్షా కేంద్రాల్లో 14,194 మంది జనరల్ విద్యార్థులకు గానూ 13,528 మంది హాజరయ్యారు. 666 మంది పరీక్షకు హాజరు కాలేదు. అలాగే 1298 మంది ఒకేషనల్ విద్యార్థులకు గానూ 1181 మంది పరీక్షకు హాజరు కాగా, 117 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. తొలిరోజు పరీక్షల సందర్భంగా ఆయా పరీక్ష కేంద్రాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్పీ కృష్ణారావు ఆదేశాల మేరకు పోలీసు సిబ్బంది గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. అలాగే డీఐఈవో కృష్ణయ్య ఆధ్వర్యంలో స్క్వాడ్ సిబ్బందితో పాటు ఇతర విద్యాశాఖ అధికారులు పరీక్షా కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించి అక్కడున్న సిబ్బందికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. మొదటిరోజు పరీక్షల్లో మాస్ కాపీయింగ్ గానీ, విద్యార్థులు డీబార్ అవ్వడం గానీ జరగలేదు. ఎటువంటి సమస్యలు, ఆటంకాలు లేకుండా ప్రశాంతంగా ముగిసినట్లు ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులు తెలియజేశారు.

ఏపీ మోడల్ స్కూల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

చిన్నమండెం, మార్చి1: మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో 2023-24 విద్యా సంవత్సరానికి 6వ తరగతి ప్రవేశాల కోసం మార్చి 3 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మార్చి 3 ఉంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారని, ఏప్రిల్ 21న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 వరకు మండల కేంద్రంలో ఉన్న ఆదర్శ పాఠశాలల్లోనే 5వ తరగతి స్థాయి సిలబస్‌తో తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150, ఎస్సీ ఎస్టీ విద్యార్థులు రూ.75లకు ఫీజు కేటాయించినట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చునని ఆయన తెలిపారు.

రైల్వేకోడూరు రూరల్ సీఐ గా సురేంద్రనాథ్‌రెడ్డి



రైల్వేకోడూరు, మార్చి 1: రూరల్ సీఐగా పి.సురేంద్ర నాథ్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న టి. మధుసూదన్‌రెడ్డి రాయచోటి స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ అయ్యారు. రైల్వేకోడూరు పోలీస్‌స్టేషన్ అప్‌గ్రేడ్ కావడంతో చిట్వేలి, ఓబులవారిపల్లె మండలాలకు సీఐగా ఆయన వ్యవహరిస్తారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా అన్ని ప్రాంతాల్లో గట్టి నిఘా గట్టిగా ఉంటుందన్నారు. ఎన్నికల రోజున ప్రశాంతంగా ఓట్లు వేసుకోవాలన్నారు. గొడవలు చేస్తే మాత్రం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అంకాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ



అంకాలమ్మ అమ్మవారు

సుండుపల్లె, మార్చి1: మండలంలోని పెద్దినేనికాల్వ గ్రామ పంచాయతీ చెరుకువాండ్లపల్లెలో శుక్రవారం కానిస్టేబుల్ వెంకటనాగులు కుటుంబ సభ్యులు హోమం, అభిషేకం కార్యక్రమాలను నిర్వహించారు తిరుమల, తిరుపతి దేవస్థానం నుంచి రూ.10 లక్షలు, కొంత మంది దాతల సహకారంతో నిర్మించిన ఆలయంలో అంకాలమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అన్నదానం, అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు.

తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శిగా

పొత్తూరి అశోక్‌కుమార్ చౌదరి

సంబేపల్లె, మార్చి1: రాజంపేట తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శిగా పొత్తూరి అశోక్‌కుమార్ చౌదరిని ఎంపిక చేస్తూ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాయచోటి తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఈ ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, యువనాయకుడు లోకేశ్‌బాబుకు ప్రత్యేక ధన్యవాదాలు , రాయచోటి ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, రాజంపేట పార్లమెంట్ అభ్యర్థి సుగవాసి సుబ్రమణ్యం, పార్లమెంట్ తెలుగు యువత అధ్యక్షుడు నవీన్‌కుమార్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేసి యువత 2024 ఎలెక్షన్‌లో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా చేసుకోవడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు సుగవాసి కుటుంబానికి ఆహ్వానం

రాయచోటిటౌన్, మార్చి1: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పాతరాయచోటిలో జరిగే ఉత్సవాలకు శుక్రవారం అగస్త్యేశ్వరస్వామి ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు, రాజంపేట పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంను ఆహ్వానించారు. మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎంపీ పాలకొండ్రాయుడు, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాద్‌బాబును కూడా ఆహ్వానించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు భక్తవత్సలం, ఎదుల లక్ష్మీప్రసాద్, కృష్ణమూర్తి, ఆలయ పూజారి మంజునాథస్వామి, శివకార్తీక్, సుదర్శన్, సాయితేజ, మహేశ్, శశి, ప్రవీణ్, ధనాంజి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు మంజూరు

ఓబులవారిపల్లె, మార్చి 1: మండలంలోని పునరావాస గ్రామాలైన ఆర్‌ఆర్-1 సెంటర్ లోని ప్రజలకు శుక్రవారం ఇంటిపట్టాలు పంపిణీ చేశారు. మంగంపేట గ్రామ పంచా యతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో 1028 కుటుంబాల వారికి పట్టాలు ఇవ్వనున్నట్లు ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాజంపేట రెవెన్యూ డివిజన్ అధికారి, ఏపీఎండీసీ సీపీవో, మండల రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు



నందలూరు, మార్చి1 : ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంత వాతా వరణంలో శుక్రవారం ప్రారంభ మయ్యాయి. ఈ సందర్భంగా ఎగ్జామినేషన్ చీఫ్ సమేత మాట్లాడుతూ తెలుగు పేపర్-1కు 264 మంది విద్యార్థులు హాజరవ్వాల్సి ఉండగా 259 మంది హాజరయ్యారన్నారు. హిందీ పేపర్-1కు పదకొండు మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు.డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా ఉమాదేవి వ్యవహరించారని తెలిపారు. ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ ఆధ్వర్యంలో పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్‌ను అమలు చేశారన్నారు.

రైల్వేకోడూరు: మండల కేంద్రంలో శుక్రవారం ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 9 గంటలకు ముందే విద్యార్థులు పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశామని రైల్వేకోడూరు సీఐ టి. బాబు, ఎస్ఐ హెచ్ డాక్టర్ నాయక్ తెలిపారు. రైల్వేకోడూరులోని 4 పరీక్ష కేంద్రాల్లో 953 మంది పరీక్షలు రాశారని చీఫ్ కస్టోడియన్ చమర్తి శారద వివరించారు. .

లక్కిరెడ్డిపల్లె: లక్కిరెడ్డిపల్లెలోని వెంకటేశ్వర ఎయిడెడ్ జూనియర్ కళాశాలలో శుక్రవారం తెలుగు పేపర్ 1 పరీక్ష ప్రారంభమైందని ప్రిన్సిపాల్ రామమోహన్ రెడ్డి తెలిపారు. 145 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా, ఐదుగురు గైర్హాజరయ్యారని వివరించారు. సెంటర్‌లో వైద్య సిబ్బంది, మంచి నీటి సౌకర్యం అందుబాటులో ఉంచారు

పెనగలూరు: పెనగలూరు ఆదర్శ జూనియర్ కళాశాల కేంద్రంలో 140మంది పరీక్షలు రాయాల్సి ఉండగా ఏడుగురు గైర్హాజరైనట్లు డిపార్ట్‌మెంట్ అధికారి శ్రీహరి తెలిపారు. పెనగలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల కేజీబీవీ జూనియర్ కళాశాల, పెనగలూరు ఆదర్శ జూనియర్ కళాశాల, చిట్వేలి మండల స్థాయి జూనియన్ కళాశాల విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు ఆయన తెలిపారు.

సుండుపల్లె: మండలంలోని ఎంకేఆర్ జూనియర్ కళాశాలలో 244 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 13 మంది గైర్హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ శైలజ తెలిపారు. పరీక్షా కేంద్రం వద్ద ఎస్ఐ ఎస్‌కేఎం 144 సెక్షన్ అమలు చేశారు. శనివారం నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభం కానున్నాయి.

పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయండి





సుండుపల్లె, లక్కిరెడ్డి పల్లెల్లో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య అధికారులు, సిబ్బంది

సుండుపల్లె, మార్చి1: పల్స్ పోలియోపై పల్లెల్లో అవగాహన కల్పించి ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించేలా చూడాలని వైద్యాధికారి శేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం రాయవరం ప్రాథమిక వైద్య కేంద్రం పరిధిలోని కుడుములవాండ్లపల్లెలో పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పోలియో చుక్కలు వేయించడం ద్వారానే పోలియో వ్యాధిని నివారించవచ్చునన్నారు. అంగవైకల్యానికి ప్రధాన కారణం పోలియో చుక్కలు వేయించకపోవడమే అన్నారు. ఈ నెల 3వ తేదీన ప్రతి గ్రామ పంచాయతీలో ఉచితంగా పోలియో చుక్కలు వేస్తారన్నారు. ఈ విషయాన్ని పల్లెల్లో ప్రజలకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది వీరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంబేపల్లె: మార్చి 3వ తేదీ జరగబోయే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శుక్రవారం సంబేపల్లె ప్రాథమిక వైద్యాధికారి సూర్యనారాయణరెడ్డి తెలిపారు. పోలియో రహిత సమాజ నిర్మాణంలో భాగంగా నిర్వహిస్తున్న పల్స్‌పోలియో కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో మైక్ ద్వారా అవగాహన కల్పించారు. హెల్త్ అసిస్టెంట్ రవిశంకర్, సూపర్‌వైజర్ సదాశివ రెడ్డి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె: మూడురోడ్ల కూడలిలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు ఎంపీహెచ్‌వో దేవదానం, సూపర్‌వైజర్ సురేంద్రనాథ రెడ్డి, మణి, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు

ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు ఉద్యమాలు ఆగవు



రాయచోటి: మాదిగ అమరవీరులకు నివాళులు అర్పిస్తున్న ఎంఆర్‌పీఎస్ నేతలు



రైల్వేకోడూరు: అమరవీరులకు నివాళి అర్పిస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

రాయచోటిటౌన్, మార్చి 1: మాదిగ అమరవీరుల 15వ సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కో-కన్వీనర్ రామాంజనేయులు ఆధ్వర్యంలో శుక్రవారం రాయచోటి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం పక్కన గల అంబేద్కర్ ఫ్లెక్సీ వద్ద మాదిగ అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన మాదిగ అమరవీరుల జ్ఞాపకార్థం ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. వర్గీకరణతోనే విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ, సంక్షేమ రంగాల్లో మాదిగలకు సామాజిక న్యాయం లభిస్తుందని ఆయన అన్నారు. అన్నమయ్య జిల్లా ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు అబ్బవరం అశోక్‌కుమార్, నాయకులు రామయ్య, వెంకటరమణ, సుబ్బయ్య, అంజనేయులు, జయరామ, గంగులయ్య, రెడ్డెయ్య తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు: ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు ఉద్యమాలు ఆగవని రాష్ట్ర ఎంఆర్‌పీఎస్ నాయకుడు వెంబడి రాధాకృష్ణ, నగరిపాటి చెంగయ్య తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ సాధన కోసం తెలంగాణ గాంధీ భవన్‌లో అగ్నికి ఆహుతైన మాదిగ అమరవీరులకు శుక్రవారం రైల్వేకోడూరు ఎంఆర్‌పీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర జాప్యం చేస్తున్నాయన్నారు. చాలా ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ చేయాలని విన్నవిస్తున్నా ఇంత వరకు ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. మాదిగ విశ్వరూపం వచ్చే ఎన్నికల్లో చూపిస్తామని తెలిపారు. ఎంఆర్‌పీఎస్ నాయకులు తాడి సిద్ధయ్య, నరసింహులు, పోలి హరిబాబు, గొంతు రాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అరాచక పాలనను అంతమొందించాలి



మాట్లాడుతున్న పోతుగుంట రమేశ్‌నాయుడు

రాయచోటిటౌన్, మార్చి 1: అరాచకంగా వ్యవహరిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నంద్యాల జిల్లా ఇన్‌చార్జి పోతుంట రమేశ్‌నాయుడు అన్నారు. శుక్రవారం ఆయన రాయచోటికి వచ్చిన సందర్భంగా బీజేపీ నేతలతో కలిసి మీడియా తో మాట్లాడుతూ రాష్ట్రంలో నిరంకుశ వైసీపీ పాలన అంతమొం దించేందుకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, రాష్ట్ర ప్రజలు కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. అన్నమయ్య జిల్లా పార్లమెంట్ సభ్యులకు రెండు పర్యాయాలు అవకాశం కల్పించినా ఈ ప్రాంత అభివృద్ధికి ఎలాంటి పనిచేయకపోగా మరొకసారి అవకాశం ఇవ్వమని చెప్పి ప్రజలను ఏ ముఖం పెట్టుకొని అడుగుతున్నారో అర్థం కావడం లేదన్నారు. ఎంపీ మిథున్‌రెడ్డి రాజంపేట పార్లమెంట్‌కు పట్టిన దరిద్రమంటూ ఈ ప్రాంత ప్రజలు భావిస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో ఆయనను ఇంటికి సాగనంప డానికి సిద్ధంగా ఉన్నారన్నారు. సీనియర్ నేత శివగంగిరెడ్డి మాట్లాడుతూ రాయచోటి ప్రాంతం పేరుకే జిల్లా అయ్యింది కానీ ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని, ఈ ప్రాంత ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం కేటాయించిన రూ.376 కోట్ల నిధులను కూడా సక్రమంగా వినియోగించుకోలేకపోవడంతో నిధులు తిరిగి వెళ్లిపోయాయ న్నారు. రాయచోటిలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు సమస్యల పరిష్కారం కోసం ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జానం బాలాజీ యాదవ్, జిల్లా కార్యదర్శి గుండ్లపల్లి వెంకటేశ్, మాదా రమేశ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఓం ప్రసాద్‌యాదవ్, బీజేవైఎం కడప జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్‌కుమార్, పట్టణ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గసభ్యులు వెంకట్రామరాజు, జయచంద్ర తదితర నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో రావణకాష్టంగా రాష్ట్రం



సమావేశంలో మాట్లాడుతున్న నాగోతు రమేశ్‌నాయుడు

వీరబల్లి, మార్చి1: వైసీపీ పాలనలో ఆంధ్రప్రదేశ్ రావణ కాష్టంలా తయారైందని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేశ్‌నాయుడు, ఓబీసీ మోర్చా జాతీయ నాయకుడు బత్తల రాజేశ్ తెలిపారు. మట్లి గ్రామంలో శుక్రవారం వారు మాట్లాడుతూ ఒక్కసారి సీఎం జగన్‌కు అవకాశం ఇచ్చి నందుకు రాజధాని లేకుండాపోయిందన్నారు. వరదలకు కొట్టుకుపోయిన అన్నమయ్య, పింఛా డ్యాంలు నేటికీ పూర్తి చేయకపోవడంతో ప్రస్తుతం ఈ ప్రాంతం అంతా కరువు బారిన పడిందన్నారు. ఇసుక తరలించిన సొమ్ము లో సగభాగం ఖర్చు చేస్తే ఈ డ్యాంలు పూర్తి అయ్యేవన్నారు. మన ఇసుక కర్ణాటక రాష్ట్రానికి తరలించి కోట్లు గడిస్తున్నారని ప్రజాప్రతినిధులపై మండిపడ్డారు. వైసీపీ పాలనలో సామాన్యులు బతకలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ధరలు విపరీతంగా పెంచి ఇబ్బందులకు గురిచేశారన్నారు. మద్యపాన నిషేధం అని ప్రజలను మభ్యపెట్టారన్నారు. నకిలీ మందుల ఫ్యాక్టరీలను ఏర్పాటు చేయించి చాలా మంది మృతికి కారకులయ్యారన్నారు. మోడీ అమలు చేసిన పథకాలను తామే అమలు చేసినట్లు చూపి ప్రచారం చేసుకోవడం దారుణంగా ఉందన్నారు. గ్రామాలు అభివృద్ధి జరిగాయంటే అవి కేంద్ర పథకాలతోనే జరిగిందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి ఎక్కడ కనిపించలేదన్నారు. ఎంపీ, ఎమ్మెల్యేలు కూడా అభివృద్ధి పట్టించుకోకుండా వారు ఆర్థికంగా స్థిరపడే మార్గాలను ఎంచుకుని అభివృద్ధి చెందారన్నారు.

రాయచోటి జిల్లా కేంద్రమైనా కనీస సౌకర్యాలు, మౌలిక వసతులు లేవన్నారు. అభివృద్ధి ఒక్క మోదీతోనే సాధ్యమవుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మట్లి ఎంపీటీసీ సభ్యుడు రాపూరి శ్రీనివాసులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఐబీ సిలబస్ అమలుపై అధ్యయనం

సంబేపల్లె, మార్చి1: రాష్ట్ర వ్యాప్తంగా 2025-26లో 1వ తరగతి నుంచి ఐబీ సిలబస్ అమలు చేసేందుకు శుక్రవారం సంబేపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను అమెరికాకు చెందిన వెండిగీన్, ఇంగ్లాండ్‌కు చెందిన ఎరిక్ బాబర్ సందర్శించారు. పాఠశాలను క్షుణంగా పరిశీలించారు. పాఠశాల ప్రాంగణం విశాలంగా పచ్చని చెట్లతో పరిశుభ్రంగా ఉంచడంపై ప్రధానోపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు. ఏపీ విద్యా విధానాలు ఐబీకి దాదాపు దగ్గరగా ఉన్నాయని ఈ సందర్భంగా వారు తెలియజేశారు. అనంతరం ఎస్‌సీఈఆర్టీ అధ్యాపకులు గిరిబాబు యాదవ్ మాట్లాడుతూ 2025-26లో ఏటా ఒక్కొక్క తరగతికి ఈ సిలబస్‌ను పెంచుతూ 2035 నాటికి పదవ తరగతికి, 2037 నాటికి 12వ తరగతి అమలు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మడితాటి నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

బండ్లపెంట దర్గా ఉత్సవాల్లో మండిపల్లి, సుగవాసి



ఉత్సవాల్లో సుగవాసి బాలసుబ్రమణ్యం, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, మార్చి1: పట్టణంలోని బండ్లపెంటలో యూసుఫ్‌షా ఖాదిరి దివానే సాహెబ్ దర్గా 66వ ఉరుసు శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. గంధం ఉత్సవంలో రాజంపేట పార్లమెంట్ టీడీపీ పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి సుగవాసి సుబ్రమణ్యం, రాయచోటి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి హాజరయ్యారు. వీరికి దర్గా కమిటీ ప్రెసిడెంట్, మాజీ కోఆప్షన్ సభ్యులు సల్లావుద్దీన్, కమిటీ సభ్యులు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దివానే సాహెబ్ దర్గాలో చాదర్‌ను సమర్పించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో రాయచోటిలో హిందూ, ముస్లింలు అందరూ తెలుగుదేశం పార్టీని ఆదరించాలని కోరారు. పూల వ్యాపారి మదనీబాషా, మాజీ సర్పంచ్ నాగేశ్వర్‌నాయుడు, మైనార్టీ సోదరులు సగదీర్, మస్తాన్, అస్రప్, షాహుల్, దర్గా షరీఫ్, ఇమ్రాన్, శివ,రమేశ్, సాంబశివరెడ్డి, కొండా తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ సభకు అభిమానుల తరలింపు

ఓబులవారిపల్లె, మార్చి1 : పీసీసీ అధ్యక్షురాలు షర్మిలా రెడ్డి పిలుపు మేరకు తిరుపతిలో నిర్వహించనున్న ఆంధ్ర ప్రదేశ్ న్యాయ పోరాట కార్యక్రమానికి అభిమానులను తరలించినట్లు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు అంకి పల్లి చెంగయ్య తెలిపారు. జిల్లా కార్యదర్శి ఉప్పుటూరు బ్రహ్మయ్య, షేక్ మగ్బూల్ బాషా, 20 మంది కార్యకర్తలు హాజరయ్యారు.

టీడీపీ పథకాలపై ఇంటింటా ప్రచారం



రాజంపేట: ప్రచారం చేస్తున్న టీడీపీ నేతలు



రైల్వేకోడూరు: ప్రచారం చేస్తున్న రేవతి

రాజంపేట, మార్చి1 : రాజంపేట పట్టణంలోని పలు వీధులలో టీడీపీ నేతలు టీడీపీ తీసుకువస్తున్న ఆరు పథకాలపై ఇంటింటా ప్రచారం నిర్వహించారు. టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో ప్రజలు పడుతున్న బాధలను గుర్తు చేశారు. తరిగోపుల లక్ష్మీనారాయణ, సింగంశెట్టి కృష్ణ కుమార్, సంజీవరావు, బాసినేని వెంకటేశ్వర్లునాయుడు, శివ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు: పట్టణంలోని బలిజవీధి, కొత్తబజారు తదితర ప్రాంతాల్లో నియోజకవర్గ టీడీపీ నాయకురాలు రేవతి శుక్రవారం ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని ప్రజలకు విన్నవించామని తెలిపారు. సూపర్‌సిక్స్ వివరాలను ప్రజలకు తెలియ జేస్తున్నామని తెలిపారు. రైల్వే కోడూరు నియోజకవర్గంలో భారీ మెజార్టీతో టీడీపీ, జనసేన అభ్యర్థి విజయం సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమం లో దళిత నాయకుడు తేనేపల్లి చిన్నా, మైనార్టీ నాయకురాలు మెహతా తదితరులు పాల్గొన్నారు.

2457 మంది రైతులకు ఈ-క్రాప్ నమోదు

రైల్వేకోడూరు, మార్చి 1: చిట్వేలి, ఓబులవారిపల్లె, రైల్వేకోడూరు, పుల్లంపేట మండలాల్లో 5,732 ఎకరాల్లో వివిధ రకాల పంటలకు 2,457 మంది రైతులకు రబీ 2023-24 సంవత్సరానికి ఈ-క్రాప్ నమోదు పూర్తి అయినట్లు రైల్వేకోడూరు సహాయ వ్యవసాయ సంచాలకులు కే. కవిత, మండల వ్యవసాయ శాఖ అధికారి జి. సుధాకర్ తెలిపారు. శుక్రవారం వారు మీడియాతో మాట్లాడుతూ ఈ-క్రాప్ లో నమోదైన రైతుల జాబితాను సామాజిక తనిఖీకి ప్రదర్శిస్తామన్నారు. . నమోదు లో ఏదైనా పొరపాట్లు ఉంటే ఈ నెల 5వ తేదీ లోపు రైతు భరోసా కేంద్రంలో ఫిర్యాదు చేయాలన్నారు. ఈ నెల 8న తుది జాబితా విడుదల అయిన తర్వాత ఎలాంటి మార్పులు ఉండవని తెలిపారు. ఈ-క్రాప్ ద్వారా పంటల బీమా, పంట నష్ట పరిహారం వంటి సంక్షేమ పథకాలు అందుతాయన్నారు.

లక్కిరెడ్డిపల్లె: ఈక్రాప్ నమోదు వివరాలను గ్రామ సభలు ఏర్పాటు చేసి రైతుల సమక్షంలో వెల్లడించాలని లక్కిరెడ్డిపల్లె వ్యవసాయ సహాయ సంచాలకులు విజయరాణి సూచించారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. లక్కిరెడ్డిపల్లె డివిజన్ పరిధిలోని రిమిపురం, లక్కిరెడ్డిపల్లె, గాలివీడు, వీరబల్లి మండలాలల్లో 9423 ఎకరాలకు ఈక్రాప్ బుకింగ్ చేయించారని. ఈ నెల 1 నుంచి 5వ తేదీ వరకు గ్రామ సభలు ఏర్పాటు చేసి రైతుల వివరాలు తెలియజేసి ఆర్‌బీకే జాబితాను అతికించాలన్నారు. ఈ పంట నమోదులో అభ్యంతరాలు ఉంటే రైతులు మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. పూర్తి చేసిన దరఖాస్తును ఆయా గ్రామ రైతు భరోసా కేంద్రంలోని గ్రామ వ్యవసాయ సహాయకుడికి అప్పగించాలన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గ్రామ సచివాలయం ప్రారంభం

పెనగలూరు, మార్చి 1 : మండలం లోని సిద్దవరం గ్రామంలో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని శుక్ర వారం ప్రారంభించారు. ఈ కార్యక్ర మానికి ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామ సర్పంచ్ ఆర్.ప్రేమలత, జెడ్పీ టీసీ యు.పి.సుబ్బరాయుడు, వ్యవసా య సంఘం సలహా కమిటీ మండల చైర్మన్ లేబాక శ్రీనివాసులరెడ్డి, ప్రైవేటు స్కూల్స్ కమిటీ చైర్మన్ ఆర్.వెంకటేశ్వరరెడ్డి, ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి, డీటీ మురళీకృష్ణ, ఏవో పద్మభూషణ్ రెడ్డి, పీఎస్ శివసాయి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో అందరికీ ఆరోగ్యం

రామాపురం, మార్చి1: మండలంలోని కుమ్మరపల్లెలో ఆ గ్రామ సర్పంచ్ ముక్కోటి భారతమ్మ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బసిరెడ్డి మాట్లాడుతూ ఈ పథకంతో పేద, ధనిక వర్గాల తేడా లేకుండా ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం చేకూరుతుందన్నారు. రామాపురం మండల వైద్యాధికారి వినోద్‌కుమార్, సీహెచ్ ఎలియాజర్, గ్రామ స్థాయి నాయకులు, ప్రజలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సుగవాసిని కలిసిన చాకిబండ టీడీపీ నాయకులు



బాలసుబ్రమణ్యంను కలిసిన చాకిబండ టీడీపీ నాయకులు

చిన్నమండెం, మార్చి1: మండలంలోని చాకిబండకు చెందిన టీడీపీ నాయకులు గాలివీడు రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో రాజంపేట టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంను, టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాద్‌బాబును మర్యాద పూర్వకంగా కలిసి తమ సంపూర్ణ మద్దతును తెలియజేశారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని తెలియజేసినట్లు వారు వివరించారు. ఎన్నికల సమయం దగ్గర పడుతున్నందున ఈ వైసీపీ అరాచక ప్రభుత్వ వైఫల్యాలను గడప గడపకు వివరించాలని నాయకులు సూచించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మానుల్లా, జయశంకర్, అల్లాబకష్, పాపిరెడ్డి, అమర్‌నాధరెడ్డి, రెడ్డెప్పరెడ్డి, ఈశ్వరయ్య, హర్షద్, అయూబ్, అక్రం అయూబ్, తంబాల రెడ్డెయ్య, కొలిమి రెడ్డెయ్య, న్యామత్, అక్బర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కళలకు కాణాచి నందలూరు



బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

నందలూరు, మార్చి1 : విద్య, వైజ్ఞానిక రంగాలతో పాటు కళలకు కాణాచిగా నందలూరు వెలుగొందుతోందని రైల్వే సీనియర్ మెడికల్ ఆఫీసర్ బచ్చు జయ భాస్కరరావు తెలిపారు. స్వర్ణాంధ్ర మదర్ ల్యాండ్ సంస్థ 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో గురువారం రాత్రి ఆ సంస్థ అధ్యక్షుడు వేపగుంట శ్యామ్‌రాజ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. వ్యాసరచన, క్విజ్, సైన్స్‌ఫేర్, చిత్రలేఖనం పోటీ విజేతలకు బహుమతులు అందజేశారు. న్యాయవాది ఆనంద్‌కుమార్, ప్రభుత్వ వైద్యుడు హీరేంద్ర సింగ్, సౌమ్యనాథ పెట్రోలు బంక్ ఓనర్ ఉప్పుశెట్టి సుధీర్, వేణుగోపాలనాయుడు, కంభం జితేంద్రకుమార్, కుర్రామణి యాదవ్, టీడీపీ నాయకులు మోడపోతుల రాము, కానకుర్తి వెంకటయ్య, గుండు (రెమో) సురేష్, గంధం గంగాధర్, విశ్రాంత రైల్వే గార్డ్ గురుప్రసాద్ హాజరయ్యారు. మహేంద్ర షోరూం మేనేజర్ హర్ష లైటింగ్, సౌండ్ సిస్టంను ఏర్పాటు చేశారు. న్యాయ నిర్ణేతలుగా స్వర్ణాంధ్ర సంస్థ డైరెక్టర్ అభిషేక్, రాజంపేట ఏఆర్ డ్యాన్స్ అకాడమీ మాస్టర్ బొజ్జ అభిరామ్ వ్యవహరించారు.

7న సీపీఐ అన్నమయ్య ప్రాజెక్టు సందర్శన

రాజంపేట, మార్చి 1: అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ఈ నెల 7న సీపీఐ ఆధ్వర్యంలో అన్నమయ్య ప్రాజెక్టు సందర్శన కార్యక్రమాన్ని తలపెట్టినట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి పి.ఎల్.నరసింహులు తెలిపారు. శుక్రవారం పట్టణ కార్యదర్శి సికిందర్ ఆధ్వర్యంలో సీపీఐ నియోజకవర్గ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పీఎల్ నరసింహులు మాట్లాడుతూ తెగిపోయిన ప్రాజెక్టును పునర్నిర్మించడంలో పాలకుల నిర్లక్ష్యం ఎటువంటిదో ఈ పాటికే ప్రజలకు అర్థమవుతోందన్నారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.మహేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు టి.రాధాకృష్ణ, నియోజకవర్గ కార్యదర్శి ఎం.శివరామకృష్ణ దేవర, సహాయ కార్యదర్శి ఎం.ఎస్.రాయుడు, పట్టణ కార్యదర్శి ఇ.సికిందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి

రాజంపేట టౌన్, మార్చి1 : ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని ఐసీటీసీ కౌన్సిలర్ వెంకటసుబ్బయ్య, టిఐ ఎన్.జి.వో అధ్యక్షులు ఏసురత్నం, ప్రాజెక్టు మేనేజర్ ఇందిర సూచించారు. శుక్రవారం పట్టణంలోని మార్కెట్, ప్రధాన రహదారులలో ఎయిడ్స్‌పై కళాజాతా నిర్వహించారు. ఎయిడ్స్ వ్యాధి సోకిన వారికి ప్రభుత్వం ఉచితంగా మందులు పంపిణీ చేస్తుందని వారు తెలిపారు.

అగ్రవర్ణాల దౌర్జన్యంపై కేసు నమోదు చేయాలి

పెనగలూరు, మార్చి1 : మండలంలోని సింగారెడ్డిపల్లె గ్రామ పంచాయతీ పరిధిలో గత ఆదివారం పందికాళ్ల నారాయణ అనే దళిత రైతుపై దౌర్జన్యం చేసినవారిపై సుమోటోగా కేసులు నమోదు చేయాలని సీపీఐ నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య మాట్లాడుతూ.. దళితుడికి చెందిన భూమిని దౌర్జన్యంగా లాక్కొనేందుకు యత్నించిన సింగారెడ్డిపల్లెవాసి, అతనికి సహకరించిన వైసీపీ నాయకుడిపై కేసు నమోదు చేయాలని కోరారు. వీరిద్దరి వద్ద ముడుపులు తీసుకొని ఇటీవల ఆన్‌లైన్ తీసేసిన రెవెన్యూ కార్యాలయ ఉద్యోగి సస్పెన్షన్‌కు సిఫార్సు చేయాలని ఆయన కోరారు.

చేతికి బైక్ దొరికితే..




రాకెట్‌లా దూసుకుపోతున్నారు

- తీరు మారని మైనర్లు
- ప్రమాదాల బారిన యువత
- కౌన్సెలింగ్ ఇచ్చినా మారని వైనం
- తల్లిదండ్రులలో కనిపించని మార్పు

కడప (క్రైం), మార్చి 1: వాళ్లది తెలిసీ తెలియని వయస్సు. పట్టుమని 18 ఏళ్లు కూడా నిండని వారు చేతికి బైకు దొరికితే చాలు.. రాకెట్‌లా దూసుకు పోతున్నారు. రోడ్లపై విన్యాసాలు ప్రదర్శిస్తూ ఇష్టానుసారం డ్రైవ్ చేస్తున్నారు. అడ్డూ అదుపు లేని వేగంతో బైకులు నడుపుతూ ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నారు. వీరితో పాటు ఎదురుగా వచ్చిన వారిని ఢీకొంటూ ప్రమాదాలకు గురిచేస్తున్నారు. ఇలా ఎంతో మంది యువత ఇటీవల ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోవడం.. కాళ్లు, చేతులు కోల్పోయి అవిటివాళ్లుగా మారి తల్లిదండ్రులకు తీరని శోకాన్ని మిగిల్చుతున్నారు.

జిల్లా ఎస్పీ సిద్ధార్థ కౌశల్ బాధ్యతలు స్వీకరించిన వెంటనే రోడ్డు ప్రమాదాలపై ప్రత్యేక నిఘా పెట్టారు. నిబంధనలకు విరుద్ధంగా తిరిగే వాహనాలపై కొరడా ఝులిపించారు. ఓవర్ స్పీడ్, మైనర్ల డ్రైవింగ్‌పై ప్రత్యేక టీమ్‌లతో నిఘా పెట్టారు. పోలీసులతో ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపట్టి.. పట్టుబడిన వాహనాలు నెలరోజుల పాటు వదలకుండా పోలీసు స్టేషన్లలోనే ఉంచారు. చివరికి వాహనదారులతో పాటు వాహనం డ్రైవింగ్ చేసిన వారికి జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలో భారీ ఎత్తున కౌన్సెలింగ్ నిర్వహించారు. పట్టుబడిన వారిలో మైనర్లు ఉంటే.. వారితో పాటు కుటుంబ సభ్యులకు కూడా కౌన్సెలింగ్ ఇచ్చారు. తెలిసీ తెలియని వయస్సులో పిల్లలకు ఇలా బైకులు ఇవ్వకూడదని.. ఇస్తే ప్రమాదాలు కొని తెచ్చుకున్నట్లు అవుతుందని చెప్పడంతో పాటు.. ఇలాగే బైకులు ఇచ్చి పంపితే మీపై కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని గట్టిగా హెచ్చరికలు జారీ చేసి పంపారు. అయినప్పటికీ పిల్లల తల్లిదండ్రుల్లో మార్పు రాకపోగా.. అతి గారాభంతోనో.. మారం చేశారనో బైకులు కొనిచ్చి ప్రమాదాలకు కారణమవుతున్నారు.



తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే..

కడపలో ఇంటర్ కళాశాల చదువుతున్న విద్యార్థులు ఎక్కువగా స్కూటీలు, పెద్ద పెద్ద బైకులపై వెళుతూ కనిపిస్తున్నారు. పోలీసులు వాహన తనిఖీలు చేస్తున్నా వీరు సందుగొందుల్లో నుంచి తప్పించుకు వెళుతున్నారు. ఒక్కో బైకులో ఒకరిద్దరు కాదు.. ఏకంగా ముగ్గురు నలుగురు కూర్చుని వెళుతుండడం గమనార్హం. మైనర్ల డ్రైవింగ్‌పై పోలీసులు ఎంత ఫోకస్ పెట్టినా... కొంత మంది తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రోత్సహిస్తుండడంతో వీరికి అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. తమ పిల్లలు హీరోల్లా రోడ్లపై బైకులు స్పీడుగా నడుపుతుంటే సంబరపడిపోయే తల్లిదండ్రులు ఉండటం గమనార్హం. మరికొందరు తమ డాబు, దర్పం చూపించుకోవడానికి స్వయంగా పిల్లలకు స్పోర్ట్స్ బైకులు కొని గిఫ్ట్‌గా ఇస్తున్నారు. దీంతో పిల్లలు మితిమీరిన వేగంతో బైకుల్లో తిరుగుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు.

పిల్లలు మారాం చేశారని..

పిల్లలు అడిగారని, మారాం చేశారని కొంత మంది తల్లిదండ్రులు బైకులు కొనిపిస్తున్నారు. అది కూడా రోడ్డుపై రయ్‌మనే దూసుకెళ్లే స్పోర్ట్స్ బైకులు, పల్సర్, ఎఫ్‌జెడ్‌లాంటి బైకులు కొనిపిస్తున్నారు. వీరికి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన లేకపోవడం... వాహనాలను అదుపు చేసే సామర్థ్యం ఉండకపోవడంతో అతి వేగం, ట్రిబుల్, అంత కన్నా ఎక్కువ మందితో నిర్లక్ష్యంతో వాహనాలు నడుపుతున్నారు. ఒకవేళ పోలీసులకు పట్టుబడినా తమ పిల్లాడు తప్పు చేశాడన్న భావన వారి తల్లిదండ్రుల్లో ఏ మాత్రం కనబడడంలేదు. తమ బిడ్డ ఏదో తెలియక వాహనం నడిపాడని పోలీసులకు నచ్చజెప్పి వాహనాలను తీసుకెళుతున్నారు. ఆ తరువాత కూడా పిల్లలను మందలించకుండా మళ్లీ వాహనాలు ఇస్తుండడం గమనార్హం.

బైకులపై విన్యాసాలు చేస్తూ..

ఇంటర్ చదివే కొంతమంది విద్యార్థులు 15 నుంచి 17 సంవత్సరాలు కూడా ఉండవు. వీళ్ల కళాశాలలకు ద్విచక్ర వాహనాల్లో రయ్‌మంటూ వెళుతున్నారు. కొన్ని కళాశాలల్లో ద్విచక్ర వాహనాలకు అనుమతులు లేవు. అలాంటి చోట చుట్టుపక్కల పార్కింగ్ చేసి కాలేజీలకు వెళుతున్నారు. కొందరు అయితే నేరుగా కళాశాలలోకి బైకులు తీసుకెళుతున్నారు. స్కూటరుపై ముగ్గురు లేదా నలుగురితో కలిసి డ్రైవింగ్ చేస్తున్నారు. మరీ ముఖ్యంగా అమ్మాయిలు ఎదురుపడ్డారంటే ఇక వారి స్పీడ్‌కు అడ్డూ అదుపూ ఉండదు. బైకు ముందు భాగం పైకి ఎత్తెత్తి నడపడం, ఇంకొందరైతే బైకు నేలమీదకు ఒంచి తోలడం లాంటి సర్కస్ ఫీట్లు చేస్తున్నారు. ఏదైనా తేడా జరిగితే గాలిలో ప్రాణాలు కలిసిపోతు న్నాయి. ఇలాంటి వారిపై పోలీసులు కఠినంగా వ్యవహరిస్తే కొన్ని రోడ్డు ప్రమాదాలనైనా నివారించవచ్చని పలువురు అంటున్నారు. అలాగే పిల్లల తల్లిదండ్రుల్లో కూడా తప్పక మార్పు రావాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు.

సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలి : ఎస్పీ



ఆర్డీవో కార్యాలయంలో పోలీసు అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ సిద్ధార్థ కౌశల్

జమ్మలమడుగు, మార్చి 1: రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పోలీసు అధికారులు, సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని ఎస్పీ సిద్ధార్థ కౌశల్ ఆదేశించారు. శుక్రవారం జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయంలో నియోజకవర్గంలోని పోలీసు అధికారులు, సిబ్బందికి ఎన్నికల కార్యాచరణకు సంబంధించి సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో నియోజకవర్గంలో పరిస్థితులను అడిగి తెలుసుకున్నట్లుగా సమాచారం. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎలాంటి ఘటనలు జరగకుండా చూడాలని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఇప్పటి నుంచే ప్రజలతో మంచి సంబంధాలు కలిగి.. ముందస్తు సమాచారం సేకరించాలని సూచించారు. కాగా, సమావేశానికి మీడియాను అనుమతించలేదు. అక్కడున్న అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదు. కార్యక్రమంలో డీఎస్పీ యశ్వంత్, ట్రైనీ డీఎస్పీ శ్రీకాంత్, నియోజకవర్గంలోని సీఐలు, ఎస్‌ఐలు, సెక్టార్ పోలీసు అధికారులు, ఎలక్షన్ సెల్ అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను పరిశీలించిన ఎస్పీ

జమ్మలమడుగు మండలంలోని అంబవరం గ్రామం వద్ద ప్రధాన రోడ్డుకు పక్కన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ఎస్పీ సిద్ధార్థ కౌశల్ పరిశీలించారు. ఎన్నికల విధుల్లో భాగంగా జమ్మలమడుగు అసెంబ్లీ నియోజకవర్గానికి రానున్న కేంద్ర సాయుధ బలగాలకు వసతి సౌకర్యం నిమిత్తం కళాశాలలో సందర్శించి పరిశీలించారు. కేంద్ర బలగాల సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా వసతులు ఏర్పాటు చేయాలని స్థానిక పోలీసు అధికారులకు తెలియజేశారు.

సినీ ఫక్కీలో మోసం

- మహిళను మోసగించి రూ.50 వేలు కాజేసిన యువకుడు

రాజంపేటటౌన్, మార్చి 1: పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంకు వద్ద ఉన్న ఏటీఎంలో నగదు తీసి ఇస్తానని చెప్పి రూ.50 వేలను కాజేసిన చేసిన విషయాన్ని సింగనమల రాజేశ్వరి శుక్రవారం రాజంపేట పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణంలోని ఎస్‌బీఐ ఏడీబీ సమీపంలోని ఏటీఎంలో డబ్బులు కోసం వెళ్లిన రాజేశ్వరి ఎంత ప్రయత్నించినా డబ్బు రాలేదు. దాంతో, పక్కనే ఉన్న యువకుడు తాను ప్రయత్నిస్తానని చెప్పి, ఆమె వద్ద ఉన్న ఏటీఎం పాస్‌వర్డ్ తెలుసుకుని ఏటీఎం నుంచి నగదును విత్‌డ్రా చేసేందుకు ప్రయత్నించాడు. చివరికి సాధ్యం కాలేదని చెప్పి ఏటీఎం కార్డు ఇచ్చి వెళ్లిపోయాడు. గురువారం 1.30 గంటల సమయంలో ఆమె బ్యాంకు ఖాతాలో ఉన్న నగదును రూ.10 వేల చొప్పున 5 సార్లు డ్రా చేసినట్లు బ్యాంకు అధికారుల ద్వారా తెలుసుకొని పట్టణ పోలీసులను ఆశ్రయించినట్లు బాధితురాలు తెలిపారు.

కారు ఢీకొని యువకుడు మృతి



మృతుడు హరీష్ (ఫైల్)

గుర్రంకొండ, మార్చి 1: కారు అతివేగంగా రోడ్డుపై నుంచి వేగ నిరోధకాన్ని ఢీకొన డంతో ఇనుపరాడ్ తగిలి యువకుడు మృతి చెందిన సంఘటన మార్కెట్ యార్డు వద్ద శుక్రవారం సాయంత్రం జరిగింది. పోలీసుల కథనం మేరకు... గుర్రంకొండ పంచాయతీ తలారివాండ్ల పల్లెకు చెందిన నరసింహులు కుమా రుడు కొమ్మిరి హరీష్(24) డ్రైవింగ్ పనిచేసుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో సాయంత్రం సొంత పనుల నిమిత్తం గుర్రంకొండ మార్కెట్ యార్డుకు వచ్చాడు. హరీష్ మదనపల్లె-గుర్రంకొండ రోడ్డు పక్కనున్న ఓ హోటల్ ముందు నిలబడి ఉండగా మదనపల్లె నుంచి అతి వేగంగా వచ్చి కారు రోడ్డుపై వేగాన్ని నియంత్రించేందుకు ఏర్పాటు చేసిన బోర్డును ఢీకొంది. ఈ నేపథ్యంలో వేగ నిరోధకానికి ఉన్న ఇనుప రాడ్ నిలబడి ఉన్న హరీష్ నుదుటకు తగిలింది. ఈ ఘటనలో హరీష్ నుదుటకు తీవ్ర రక్త గాయమైంది. బాధితున్ని 108లో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి చనిపోయినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, రెండు నెలల కుమారుడు ఉన్నారు. రోడ్డు ప్రమాదంలో కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు బోరున విలపించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగార్జునరెడ్డి తెలిపారు.

కరెంటు తీగలు తగిలి వ్యక్తి మృతి

సుండుపల్లె, మార్చి 1: మండలంలోని ముడుంపాడు గ్రామ పంచాయతీ జనార్దన్‌రెడ్డినగర్ కాలనీకి చెందిన మేకల ద్వారకనాథ్ (45) కరెంటు తీగలు తగిలి మృతి చెందినట్లు శుక్రవారం పోలీసులు తెలిపారు. ఇతను విద్యుత్‌కంచెను ఏర్పాటు చేసి కుందేళ్లను వేటాడేవాడు. ఇదే క్రమంలో గత శుక్రవారం జనార్దన్‌రెడ్డి నగర్‌కాలనీ సమీపంలోని మామిడి తోటలో ఏర్పాటు చేసిన విద్యుత్ కంచె తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు అతనిని తిరుపతికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. ఈ మేరకు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం

- పల్స్ పోలియో ఏర్పాట్లు పూర్తి
- రేపు 0-5 సంవత్సరాల చిన్నారులకు టీకా వ్యాక్సిన్ పంపిణీ
- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ నాగరాజు

కడప(కలెక్టరేట్), మార్చి 1: పోలియో రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతిఒక్కరూ తమవంతు సహకారం అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు పిలుపు నిచ్చారు. శుక్రవారం డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలోని తన ఛాంబరులో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ పల్స్ పోలియో కార్యక్రమం ఈ నెల 3న జిల్లా వ్యాప్తంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని, 0-5 ఏళ్ల లోపు చిన్నారులకు పోలియో చుక్కల మందు వేయుటకు 2029 పోలియో బూత్‌లు, 51 మొబైల్ బృందాలు పనిచేయనున్నాయన్నారు. 23 ట్రాన్స్‌విట్ పాయింట్స్ ద్వారా 8264 వ్యాక్సినేటర్స్, 203 రూట్ సూపర్‌వైజర్ల ద్వారా ఈ కార్యక్రమం విజయవంతం చేయుటకు ఏర్పాట్లు సిద్ధం చేశామన్నారు. భారతదేశం పోలియో రహిత దేశంగా ప్రటించడం జరిగిందని, అయినప్పటికీ పొరుగు దేశం పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ దేశాల్లో పోలియో కేసులు ఉండడంతో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా మన ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలో 2006 తరువాత పోలియో కేసుల నమోదు కాలేదన్నారు. వలసలు వచ్చిన వారు, భవన నిర్మాణ కార్మికులు, గ్రామాలకు దూరంగా నివసించే వారి పిల్లలతో పాటు పట్టణ మురికివాడల్లో ఈ వ్యాక్సిన్ చిన్నారులకు అందించేందుకు ప్రత్యేక దృష్టి సారించామన్నారు. వందశాతం పోలియో చుక్కలు వేయుటకు సిద్ధంగా ఉన్నామన్నారు. జిల్లా టీకాల అధికారి డాక్టర్ ఉమామహేశ్వరకుమార్ మాట్లాడుతూ 0-5 ఏళ్ల చిన్నారులకు టీకా మందు అందించేలా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఈ సమావేశంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్లు శశిభూషణ్‌రెడ్డి, రవిబాబు, రమేష్, సునీత, మాస్ మీడియా అధికారిణి భారతి, సహ మీడియా అధికారిణి రమణమ్మ, కమ్యూనిటీ ఆరోగ్య అధికారి మునిరెడ్డి, ఆరోగ్య విస్తరణ అధికారి రాధాకృష్ణ తదితరులు పాల్గొని పోస్టరును విడుదల చేశారు.

రాచమల్లు చేసిన వ్యాఖ్యలు అవాస్తవం : శశిభూషణ్‌రెడ్డి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి

ప్రొద్దుటూరు, మార్చి 1: భారతీయ జనతా పార్టీ మతతత్వ పార్టీ అని.. ముస్లిం మైనారిటీ ఓట్ల కోసం ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు అవాస్తవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరులో రాచమల్లు ప్రసాద్‌రెడ్డి అంటే మాఫియాకు కేరాఫ్ అడ్రస్ అని.. నీకు బీజేపీ గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. బీజేపీ దేశంలోని 140 కోట్ల జనాభాను సమానంగా చుస్తుందన్నారు. ప్రొద్దుటూరులో నీ ఓటమి ఖరారైందని తెలుసుకుని.. ముస్లిం ఓటర్ల కోసం బీజేపీని మతతత్వ పార్టీ అని ప్రచారం చేస్తే నమ్మే పరిస్థితి లేదన్నారు. జగన్ ప్రభుత్వంలో వైసీపీ ఎమ్మెల్యేలు.. ముఖ్యంగా ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి ఈ ఐదేళ్లకు ముందు ఐదేళ్ల తరువాత ఆస్తులు భవనాలపై నాడు నేడు కింద బహిరంగ పరచాలన్నారు. వందల కోట్ల రూపాయలు భూదందాలు, ఇసుక దోపిడీ, మట్కా, గుట్కా, క్రికెట్ బెట్టింగ్, దొంగనోట్లు ఇలా అన్నిరకాల అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ.. నేర సామ్రాజ్యాన్ని నిర్మించుకుని ప్రొద్దుటూరును పాలిస్తున్నాడని తీవ్రంగా విమర్శించారు. నీ అవినీతి, దౌర్జన్యాలు హత్యా రాజకీయాలపై ప్రజలు త్వరలో తీర్పు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం ప్రధాని నరేంద్రమోదీ పేదలకు ఉచితంగా బియ్యం, ఇళ్లు, ఆయుష్మాన్ భారత్ కింద వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. కేంద్ర నిధులు పథకాలను తమ పథకాలుగా ప్రచారం చేసుకుంటూ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో మీ పతనం తప్పదని హెచ్చరించారు. సమా వేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి క్రిష్ణప్రదీప్‌రెడ్డి, గురు ప్రసాద్, రవి, వంకదార నరేంద్రలు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణను బాధ్యతగా తీసుకోవాలి



మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి

కడప(ఎర్రముక్కపల్లె), మార్చి 1: మొక్కల సంరక్షణను వలంటీర్లు బాధ్యతగా తీసుకోవాలని ప్రిన్సిపాల్ ప్రొఫెసరు ఎస్.రఘునాథరెడ్డి తెలిపారు. శుక్రవారం వైవీయూ ఎన్‌ఎస్‌ఎస్ పీవో డాక్టర్ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మొక్కలను నాటించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వలంటీరు మొక్కలకు నీరుపోసి వాటి బాగోగులను బాధ్యతగా తీసుకోవాలన్నారు. దీనివల్ల మీ డిపార్ట్‌మెంటు పరిసరాలు పచ్చదనంతో పాటు కాలుష్యం లేకుండా ఆహ్లాదకరంగా ఉంటాయన్నారు. కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ రెడ్డయ్య వలంటీర్లకు సూచనలు చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్వేత, నారాయణరెడ్డి, హనుమంతనాయక్, జ్యోతి పాల్గొన్నారు.

రెండు ఇళ్లలో చోరీ - నగలు అపహరణ

ములకలచెరువు, మార్చి 1: ములకలచెరువులో గురువారం రాత్రి రెండిళ్లలో చోరీ జరిగినట్లు ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు. స్థానిక కదిరి రోడ్డులో ఉంటున్న బాల్‌రెడ్డి కుటుంబీకులు బంధువుల ఇంటికి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో దొంగలు తాళాలు తొలగించి లోనికి ప్రవేశించారు. ఇంట్లోని రెండు బీరువాలను పగులగొట్టి అందులోని 31 గ్రాముల బంగారు నగలను ఎత్తుకెళ్లారు. అలాగే పక్కింట్లో కూడా ఓ బంగారు ఉంగరాన్ని, కొంత నగదును చోరీ చేసినట్లు ఆయన తెలిపారు. చోరీ జరిగిన ఇళ్లను పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. క్లూస్ టీ అధికారులు వేలిముద్రలను సేకరించినట్లు వివరించారు.

ముదిరాజ్ సంఘం కన్వీనర్‌గా నాగేశ్వరరావు

ఎర్రగుంట్ల, మార్చి 1: కడప పార్లమెంటు ముదిరాజ్ (ముత్రాస) టీడీపీ సాధికార సమితి కమిటీ కన్వీనర్‌గా సుంకర నాగేశ్వరరావును నియమించినట్లు ప్రకటనలో తెలిపారు. ఆయనతో పాటు సి.రామాంజనేయులు, వెంకటరమణయ్య, సి.నాగరాజు, వెంకట సుబ్బయ్య, ఎస్.లోకేశ్, కె.శ్రీనివాసులు, ఎం.నాగరాజు, సి.నాగేంద్ర, జి.వెంకటరమణ, పి.రామప్రసాద్‌రావు, కె.రమణయ్య, పి.భరత్‌కుమార్, బి.ఓబులేసులను కమిటీ సభ్యులుగా ఎంపిక చేసినట్లు తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన ముఖ్యం

- సమగ్రశిక్ష పీవో అంబవరం ప్రభాకర్‌రెడ్డి



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న ప్రభాకర్‌రెడ్డి, దుర్గాప్రసాద్

కడప(ఎర్రముక్కపల్లె), మార్చి 1: ఆర్థిక అక్షరాస్యత, సైబర్ నేరాలు, బ్యాంకు లావాదేవీలపై విద్యార్థులకు అవగాహన ఎంతో ముఖ్యమని జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి, లీడ్ బ్యాంకు మేనేజరు దుర్గాప్రసాద్ తెలిపారు. శుక్రవారం కడప నగరం చెమ్ముమియాపేట బాలికోన్నత పాఠశాల, గాంధీనగర్ మున్సిపల్ హైస్కూలు, శ్రీహరి డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు బ్యాంకింగ్ రంగంపై సైబర్ నేరాలు, ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించి క్విజ్ పోటీలు, ఎస్సే రైటింగ్ కార్యక్రమాలు నిర్వహించారు. విజేతలకు సర్టిఫికెట్లను లీడ్ బ్యాంకు మేనేజరు దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో అందించారు. వారు మాట్లాడుతూ రానున్న కాలంలో సైబర్ నేరాల గురించి అవగాహన పెంపొందించుకుని వాటికి దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు సమాజం, వ్యవస్థలపై సంపూర్ణ అవగాహన ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మేరీ, సుజాతమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇసుక డంపింగ్‌పై పోలీసుల ఆరా

మదనపల్లెటౌన్, మార్చి 1: మదనపల్లె పట్టణ శివారుల్లో ఇసుక డంపింగ్, అక్రమ రవాణాపై పోలీసులు ఆరా తీస్తున్నారు. 'పగలు డంపింగ్.. రాత్రి స్మగ్లింగ్' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో శుక్రవారం ప్రచురితమైన వార్తకు మదనపల్లె తాలూకా పోలీసులు స్పందించారు. మదనపల్లె మండలం తురకపల్లె ఈద్గా వద్ద, చిప్పిలి గ్రామంలోని ఇళ్ల మధ్య వందలాది టిప్పర్ల ఇసుకను డంపింగ్ చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మదనపల్లె తాలూకా సీఐ శేఖర్ ఈ విషయమై ఆరా తీయాల్సిందిగా ఎస్‌ఐ రవికుమార్‌ను ఆదేశించారు. దీంతో శుక్రవారం ఎస్‌ఐ, సిబ్బందితో తురకపల్లె వద్ద డంపింగ్ చేసిన నిల్వలను పరిశీలించారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

పాలిసెట్, ఏపీఆర్‌జేసీలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(విద్య), మార్చి 1: ఏపీ రాష్ట్రంలో 2024-25 విద్యా సంవత్సరానికి రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలు(ఇంటర్మీడియట్), పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఏపీఆర్‌జేసీ, పాలిసెట్ ప్రవేశ పరీక్షలకు అర్హులైన విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు కోరుతున్నారని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, తిరుపతిలోని విశ్వం పోటీ పరీక్షల శిక్షణా కేంద్రం డైరెక్టర్ డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీల్లో ప్రవేశాల కోసం ఈ ఏడాది టెన్త్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు దరఖాస్తు చేయవచ్చని, ఈనెల 31వ తేదీతో దరఖాస్తు గడువు ముగుస్తుందని తెలిపారు. అలాగే డిప్లొమా పాలిటెక్నిక్ కోర్సుల కోసం నిర్వహించే పాలిసెట్‌కి ఏప్రిల్ 5వ తేదీతో దరఖాస్తు గడువు ముగియనుందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 8688888802/03, 9399976999 నంబర్లను సంప్రదించాలని కోరారు. ఇదిలా ఉండగా ఏపీఆర్‌జేసీకి దరఖాస్తు గడువు మార్చి 31 కాగా, పరీక్ష తేది ఏప్రిల్ 25 ఉంటుందని, ఏపీపాలిసెట్ దరఖాస్తు గడువు ఏప్రిల్ 5 కాగా, పరీక్ష ఏప్రిల్ 27 ఉంటుందని తెలిపారు.

అగ్నికి ఆహుతవుతున్న మల్లయ్యకొండ

తంబళ్లపల్లె, మార్చి 1: తంబళ్లపల్లెకు సమీపంలోని మల్లయ్యకొండ అటవీ ప్రాంత సముదాయాలు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తులు అడవికి నిప్పు పెట్టడంతో అవి దావానంలా వ్యాపించాయి. దీంతో మల్లయ్యకొండ రోడ్డుకు తూర్పు వైపు ఉన్న ఎద్దుమీదిబోడు, మేకపోతుదొన, రెండు దొనాలపెంట తదితర ప్రాంతాలు సుమారు 400 హెక్టార్లకు పైగా అగ్నికి ఆహుతైనట్లు తెలుస్తోంది. వందల ఎకరాల్లో అడవి కాలిపోవడంతో పలు రకాల జాతులకు చెందిన వృక్ష సంపదతో పాటు వన్యప్రాణులు, పశుగ్రాసం, బోద మంటలకు కాలి బూడిదైపోయింది. కొండ కింద వ్యవసాయ పొలాలున్న రైతులు తమ పొలాల్లోకి పెద్ద ఎత్తున మంటలు రావడంతో ఆందోళన చెందారు. కొందరు రైతులు తీవ్రంగా శ్రమించి పొలాల్లోకి వచ్చిన మంటలను అదుపుచేశారు. కాగా, వారం రోజుల కిందట ఆకతాయిలు నిప్పుపెట్టడంతో మర్రి కొండలో సుమారు 600 హెక్టార్లకు పైగా అగ్నికి ఆహుతైన విషయం తెలిసిందే. ఇప్పటికైనా అటవీశాఖాధికారులు అడవుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

నిర్లక్ష్యం నీడలో సాగునీటి ప్రాజెక్టులు

పీలేరు, మార్చి 1: పీలేరు నియోజకవర్గంలో ప్రజల సాగు, తాగునీటి అవసరాల కోసం నిర్మించిన అడవిపల్లె, ఝరికోన ప్రాజెక్టులను వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. కేవీపల్లె మండలంలోని జిల్లేళ్లమంద పంచాయతీ పరిధిలో శుక్రవారం టీడీపీ, జనసేన శ్రేణులతో కలిసి 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవీపల్లె మండల ప్రజల కోసం తన అన్న కిరణ్‌కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కడప జిల్లా నాయకులు, ప్రజలతో విభేదించి మరీ ఝరికోన ప్రాజెక్టు నిర్మించామని గుర్తు చేశారు. కేవీపల్లె, కలకడ, కలికిరి మండలాలకు తాగునీరు, కేవీపల్లె మండలంలోని గ్రామాలకు సాగునీటి కోసం నిర్మించిన ఆ ప్రాజెక్టు నిర్వహణ లేకపోవడంతో పైపులైన్లు శిథిలావస్థకు చేరుకున్నాయని వాపోయారు. పీలేరు నియోజకవర్గంలోని సుమారు 70 వేల ఎకరాలకు సాగు నీరు అందించేందుకు హంద్రీ-నీవా పథకంలో భాగంగా అడవిపల్లె వద్ద రిజర్వాయర్‌ను నిర్మించామని గత ప్రభుత్వంలో పనులన్నీ పూర్తయినప్పటికీ వైసీపీ నాయకులు కుట్రలు, కుతంత్రాల కారణంగా అది ప్రారంభానికి నోచుకోలేదన్నారు. ప్రస్తుత వైసీపీ పాలనలో అరాచకాలు, దౌర్జన్యాలు, దోపిడీలు, కబ్జాలు తప్ప అభి వృద్ధి ఊసే లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో తనను ఆదరించి గెలిపించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. టీడీపీ మినీ మేనిఫెస్టోలో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో కూడిన కరపత్రాలను పంచుతూ ఆయన జిల్లేళ్లమంద పంచాయతీలోని దేవాండ్లపల్లె, జిల్లేళ్లమంద తాండా, నగరి, శెట్టిపల్లె, వడ్డిపల్లె గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ ఉదయశ్రీ, కేవీపల్లె మండల పార్టీ అధ్యక్షురాలు గీతాంజలి, రాజంపేట పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి రవిచంద్రారెడ్డి, గాలి సుధాకర్ నాయుడు, మహేంద్ర రెడ్డి, కంకడ్డర్ రమణ, కంచి సూరి, ప్రసాద్‌రెడ్డి, శేషాద్రి నాయుడు, మౌలా, రెడ్డిశేఖర్, రహంతుల్లా, రంజిత్, రెడ్డప్పరెడ్డి, 'సంఘం' శివారెడ్డి, వెంకీ పాల్గొన్నారు.



జిల్లేళ్లమందలో వ్యవసాయ కూలీలతో మాట్లాడుతున్న నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి

ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం

● రూ.45వేలు గుంజిన వైనం

● పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

మదనపల్లె టౌన్, మార్చి 1: ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి ఓ ప్రైవేటు సంస్థ మోసగించిన వైనం మదనపల్లెలో వెలుగుచూసింది. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. మదనపల్లె పట్టణం సీటీఎం రోడ్డు బాపూజి పార్కు ఎదురుగా నాలుగంతస్థుల భవనంపై ఓ ప్రైవేటు సంస్థ నాలుగు నెలలుగా కన్సల్టెంట్, గైడ్‌లైన్స్ పేరుతో నిరుద్యోగులకు నెల రోజుల పాటు శిక్షణ ఇస్తామని ప్రచారం చేస్తోంది. ఇందులో భాగంగా చిత్తూరు జిల్లా ఐరాల మండలం కంచెం వారిఇండ్లుకు చెందిన అమరనాథ్ కుమారుడు రాజశేఖర్ (19)కు అతని స్నేహితుడు జగదీష్ ద్వారా మదనపల్లెలో ఓ సంస్థ నిరుద్యోగులకు ఉద్యోగం కల్పిస్తారని చెప్పడంతో మదనపల్లెకు చేరుకుని సంస్థ ప్రతినిధులతో మాట్లాడారు. రూ.45 వేలు చెల్లిస్తే ఉద్యోగాలు ఇస్తామని చెప్పడంతో తన తండ్రి వద్ద రూ.45వేలు నగదు తీసుకుని సంస్థకు చెల్లించారు. అతని కి తెలుపు షర్టు, నలుపు ప్యాంటు యూనిఫామ్ దుస్తులు అందజేసి తరువాత రాజశేఖర్‌ను మరో ఐదు మంది నిరుద్యోగులను ఈ స్కీమ్ కింద చేర్పమని షరతులు పెట్టారు. తనకు ఉద్యోగం కల్పించమని కోరితే చైన్ లింక్ బిజినెస్ చేయమంటారేమంటూ రాజశేఖర్ ప్రశ్నించడంతో అతడిని సంస్థ ప్రతినిధులు బయటకు గెంటేశారు. దీంతో బాధితుడు శుక్రవారం మదనపల్లె టు టౌన్ సీఐ యువరాజుకు ఫిర్యాదు చేశాడు. దీనిపై ప్రైవేటు సంస్థ ప్రతినిధులను స్టేషన్‌కు పిలిపించిన సీఐ అక్కడ జరుగుతున్న ప్రక్రియపై ఆరా తీశారు. చైన్ లింక్ సిస్టం ద్వారా నిరుద్యోగులను మోసం చేస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. సంస్థ ద్వారా ఎంత మం దికి ఉద్యో గాలు కల్పించారో తదితర విషయాలపై విచారిస్తున్నారు. నిరుద్యోగులను మోసం చేసే సంస్థలపై తప్పకుండా కేసు నమోదు చేసి బాధితులకు న్యాయం చేస్తామని సీఐ పేర్కొన్నారు.

ఇసుక డంపింగ్..స్మగ్లింగ్‌పై పోలీసుల ఆరా

మదనపల్లె టౌన్, మార్చి 1: మదనపల్లె పట్టణ శివారుల్లో ఇసుక డంపింగ్, అక్రమ రవాణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. 'పగలు డంపింగ్..రాత్రి స్మగ్లింగ్' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం ప్రచురితమైన వార్తా కథనానికి మదనపల్లె తాలూకా పోలీసులు స్పందించారు. ఈ క్రమంలో మదనపల్లె తాలూకా సీఐ శేఖర్ ఈ విషయమై ఆరా తీయాల్సిందిగా తాలూకా ఎస్ఐ రవికుమార్‌ను ఆదేశించారు. దీంతో శుక్రవారం ఎస్ఐ రవికుమార్, సిబ్బందితో తురకపల్లె వద్ద డంపింగ్ చేసిన ఇసుక నిల్వలను పరిశీలించారు. ఈ ఇసుకను ఎవరు, ఎక్కడి నుంచి రవాణా చేస్తున్నారన్న విషయమై ఆరా తీస్తున్నామన్నారు. సీఐ శేఖర్ మాట్లాడుతూ అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారిపై నిఘా పెట్టి పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచండి

మదనపల్లె టౌన్, మార్చి 1: ఎండాకాలం వ్యవసాయ పనులు తక్కువగా ఉన్నాయని, గ్రామాల్లో ఉపాధి పనులను పెంచడంతో పాటు కూలీల సంఖ్య కూడా పెంచాలని డ్వామా పీడీ మద్దిలేటి ఆదేశించారు. శుక్రవారం మదనపల్లె మండలం టేకులపాళెం, వేంపల్లె గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను పీడీ పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరంలో మదనపల్లె మండలంలో చేప ట్టాల్సిన పనులను గుర్తించి నివేదికలను పంపాలని ఏపీవో సుబ్రమణ్యంను ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీడీ మధు బాబు, టీఏస్ బాబాజి, సురేష్, షహీనా, దివ్యభారతి పాల్గొన్నారు.

పరిశ్రమలు తెమ్మంటే.. మద్యం తెచ్చాడు!

పీలేరు, మార్చి 1: రాష్ట్ర యువతకు ఉద్యోగాలిచ్చే ఎంఎన్‌సీలు తెమ్మంటే ముఖ్యమంత్రి జగన్ కొత్త రకం మద్యం బ్రాండ్లు తెచ్చాడని తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు ఆరోపించారు. పీలేరులోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం వారు విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పఠాన్ మౌలా, టీఎన్ఎస్ఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి అబ్బూరి జయచంద్ర నాయుడు మాట్లాడుతూ పరిశ్రమలంటే మద్యం డిస్టలరీలేనన్న భ్రమలో ముఖ్యమంత్రి ఉన్నారని వారు ఎద్దేవా చేశారు. సమావేశంలో రాజంపేట పార్లమెంటు ఉపాధ్యక్షుడు ముబారక్, పీలేరు నియోజకవర్గ అధ్యక్షుడు ఎన్వీఆర్ నఫీస్, నేతలు పాల్గొన్నారు.

కారు ఢీకొని యువకుడు మృతి

గుర్రంకొండ, మార్చి 1:కారు అతి వేగంగా రోడ్డుపై ఉంచి వేగ నిరోధకాన్ని ఢీకొనడంతో ఇనుప రాడ్ తగిలి కొమ్మిరి హరీష్(24) యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు గుర్రంకొండ పంచాయితీ తలారివాండ్లపల్లెకు చెందిన నరసింహులు కుమారుడు హరీష్ సొంత పనుల నిమితం గుర్రంకొండ మార్కెట్ యార్డుకు వచ్చి మదనపల్లె-గుర్రంకొండ రోడ్డు పక్క న నిలబడి ఉండగా మదనపల్లె నుంచి అతి వేగంగా వచ్చి కారు రోడ్డుపై వేగాన్ని నియంత్రించేందుకు ఏర్పాటు చేసిన బోర్డును ఢీకొంది. వేగ నిరోధకా నికి ఉన్న ఇనుప రాడ్ హరీష్ నుదుటకు తగిలి నుదుటకు తీవ్ర రక్త గాయమైంది. బాధితున్ని 108లో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తలరించగా అక్కడ వైద్యులు పరీక్షించి చనిపోయినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, రెండు నెలల కుమారుడు ఉన్నారు.

టీడీపీ రాజంపేట పార్లమెంట్ జిల్లా ఉపాధ్యక్షుడిగా సురేంద్ర

మదనపల్లె, మార్చి 1: టీడీపీ రాజంపేట పార్లమెంట్ జిల్లా ఉపాధ్యక్షుడిగా పులకంటి సురేంద్ర ఎన్నికైనట్లు రాజంపేట పార్లమెంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి యాలగిరి దొరస్వామినాయుడు తెలిపారు. తంబళ్లపల్లె నియోజకవర్గం కురబలకోట మండలం తుమ్మచెట్లపల్లె గ్రామానికి చెందిన సురేంద్ర కొన్నేళ్లగా టీడీపీ అభివృద్ధికి కృషిచేస్తున్నారన్నారు. శుక్రవారం రాజంపేట పార్లమెంట్ నేత సుగవాసి సుబ్రమణ్యం చేతుల మీదుగా సురేంద్ర నియామక పత్రాన్ని అందుకున్నారు. తనకీ పదవి రావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

తిరుపతి సభకు తరలివెళ్లిన కాంగ్రెస్ నేతలు

మదనపల్లె అర్బన్, మార్చి1: తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో ఏపీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిల ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ సాధన సభకు మదనపల్లె నియోజకవర్గనాయకుడు రెడ్డిసాహెబ్ నాయకత్వంలో పార్టీ శ్రేణులు శుక్రవారం తరలి వెళ్లాయి. ముందుగా పట్టణంలోని ఇందిరానగర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి భారీ ర్యాలీగా బెంగళూరు బస్టాండ్ వరకు చేరుకుని ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం తిరుపతికి 10 కార్లు, 9 బస్సులోల భారీ సంఖ్యలో పార్టీనాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. కార్యక్రమంలో రాష్ట్రమైనార్టీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్కే బాషా, రూరల్ అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, మహబూబ్‌పీర్, మహ్మద్ అలీ, మహమ్మద్‌రఫీ, వెంకటరమణ, నాగరాజ, ముబారక్, హరిప్రసాద్, అమరావతి బయ్యారెడ్డి, సయ్యద్, రవీంద్ర, ఈశ్వరమ్మ, చాంద్‌బాషా షామీర్‌ఖాన్, గంగలప్ప, పాలేటి, సోను పాల్గొన్నారు.

రీసర్వేలో జరిగిన తప్పులను పట్టించుకోరా..?

ములకలచెరువు, మార్చి 1: భూముల రీసర్వేలో జరిగిన తప్పొప్పులు గురించి పట్టించుకోరా? అని మండల సమావేశంలో సభ్యులు రెవెన్యూ అధికారులను నిలదీశారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ సాయిలీల అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సెంట్రల్ స్కూల్ సర్పంచ్ వెంకటరమణారెడ్డి, ఆర్‌బీకే చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ భూముల రీసర్వేలో తప్పులు దొర్లినా పట్టించుకోవడం లేదన్నారు. భూమి లేని ఓ వ్యక్తి పేరుమీద 38 సెంట్లు వచ్చిందని, దీన్ని తొలగించాలని ఆ వ్యక్తి పదే పదే చెబుతున్నా రెవెన్యూ అధికారులకు పట్టడం లేదన్నారు. సింగిల్ విండో చైర్మన్ ఏవీ గౌరీశంకర్‌రెడ్డి మాట్లాడుతూ రైతుల కోసం కేంద్ర, రాష్ట్ర పథకాలు అమలు చేస్తున్న పథకాల గురించి కనీసం సమాచారం ఇవ్వడం లేదన్నారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు మోహన్‌రెడ్డి, ఫలితంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఎంపీడీవో పోలప్ప, డీటీ హరికుమార్, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వేసవిలో నీటి సమస్యలు రాకుండా చూడండి

పెద్దమండ్యం, మార్చి 1: వేసవిలో తాగునీటి సమస్యలు రాకుండ ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీపీ పూర్ణచంద్రిక రమేష్ పేర్కొన్నారు. పెద్దమండ్యం ఎంపీడీవో కార్యాలయం లో శుక్రవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో తారురోడ్లల్లో గుంతల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని వెంటనే ఆ రోడ్లకు మరమ్మతులు చేపట్టాలన్నారు. ఎంపీడీవో వెంకటరమణయ్య మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. తహసీల్దార్ లక్ష్మీనాయక్ మాట్లాడుతూ ఓటరు జాబితా బీఎల్వోల వద్ద పరిశీలించుకోవాలని తెలిపారు. జడ్పీటీసీ సభ్యురాలు పీరమ్మ, కోఆప్షన్ ఖాదర్‌వలీ, ట్రాన్స్‌కో ఈఏ శంకర్‌రెడ్డి, ఏపీఎం మధుశేఖర్‌బాబు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు వీఆర్వోలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

మల్లయ్యకొండకు 40ఆర్టీసీ బస్సులు

మదనపల్లె అర్బన్, మార్చి1: మల్లయ్యకొండలో వెలసిన భ్రమరాంబికమల్లికార్జున స్వామి ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాలకు వన్ డిపో నుంచి 40 ఆర్టీసీ బస్సులు నడుపతున్నట్లు డిపో మేనేజరు మూరేవెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. పవిత్రమైన మల్లయ్యకొండ దర్శనానికి విరివిగా బస్సుల ఏర్పాటు చేశామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

4న పీలేరులో జాబ్ మేళా

పీలేరు, మార్చి 1: పీలేరులోని సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 4వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మెడ్ ప్లస్, పేటీఎం, ముత్తూట్ ఫైనాన్స్ అపోలో ఫార్మసీ, యంగ్ ఇండియా, టాటా ఎలక్ట్రానిక్స్ సంస్థల ప్రతినిధులు పాల్గొనే ఈ జాబ్ మేళాలో డిగ్రీ, పీజీ చేసిన వారు పాల్గొనవచ్చునని ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు 9493212454, 9441900909 సంప్రదించాలని తెలిపారు.

ఆస్తిపన్నుపై వడ్డీ రాయితీ

బి. కొత్తకోట, మార్చి1: ఆస్తిపన్ను పై వడ్డీమాఫీ చేస్తూ ప్రభుత్వం ఇచ్చిన వెసులుబాటును నగర పంచాయతీ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగరపంచాయతీ కమిషనర్ పీఎస్ మనోహర్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ బకాయి మొత్తాన్ని ఏక కాలంలో చెల్లించే వారికి మాత్రమే ఇది వర్తిస్తుందన్నారు. నగరపంచాయతీ పరిధిలో రూ. 1.60 కోట్ల పాతబకా యిలు, 2023-24 కు సంబంధించి కొత్తవి రూ.70లక్షలు వున్నాయన్నారు. వాటిని ఈనెల 31 వరకు మాత్రమే చెల్లించేందుకు గడువు ఉందని 2శాతం వడ్డీని మాఫీ చేస్తూ జీవో విడుదలైందన్నారు.

టీడీపీ గెలుపు కోసం సైనికుల్లా పని చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి

పెద్దమండ్యం, మార్చి 1: టీడీపీ గెలుపు కోసం టీడీపీ-జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు సైనికుల్లాగా పని చేయాలని తంబళ్లపల్లె టీడీపీ, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి దాసరిపల్లె జయచంద్రరెడ్డి పిలుపు నిచ్చారు. పెద్దమండ్యంలో శుక్రవారం జయచంద్రరెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా కార్యకర్తల సమావేశంలో జయచంద్రరెడ్డి మాట్లాడుతూ హంద్రీ-నీవా కాలువల ద్వారా తంబళ్లపల్లె నియోజకవర్గంలోని అన్ని చెరువులకు నీటిని నింపుతామన్నారు. తంబళ్లపల్లిలో టీడీపీ జనసేన పార్టీల జండా ఎగరవేయాలన్నారు. రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్ఎం పర్వీన్‌తాజ్, జిల్లా టీడీపీ బీసీ అధ్యక్షుడు సురేంద్రయాదవ్, నాయకులు సిద్దవరం ప్రసాద్, హనీంసాబ్, గంగాధర, వేణుగోపాల్‌రెడ్డి, దత్తాత్రేయరెడ్డి, రామకృష్ణరెడ్డి, బాబురెడ్డి, చలపతి, రామాంజులునాయుడు, బాబురెడ్డి, అమరనాథ, సాంబ, శేషాద్రి, సయ్యద్ షావలి, భాస్కర్‌నాయుడు, కువైట్ శంకర్, నియోజ వర్గం జనసేన ఇన్‌చార్జ్ సాయినాథ, శంకర, ఆనంద, శ్రీనాథ పాల్గొన్నారు.

తప్పుడు కేసులు పెట్టి భయపెడుతున్నారు



మదనపల్లె సబ్‌జైలు బయట మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ దొరబాబు

మదనపల్లె టౌన్, మార్చి 1: రాష్ట్రంలో టీడీపీ శ్రేణులను భయపెట్టేందుకు వైసీపీ నాయకులు పోలీసులపై ఒత్తిడి తెచ్చి తప్పుడు కేసులు పెట్టి భయపెడుతున్నారని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సబ్‌జైలులో రిమాండులో వున్న సర్పంచుల సంఘం ప్రతినిధిగా వున్న కోకా ప్రకాష్‌ను పరామర్శించారు. దొరబాబు మాట్లాడుతూ కోకా ప్రకాష్ టీడీపీలో చురుగ్గా పనిచేస్తూ, వైసీపీ అరాచకాలను ఎండగుడుతున్నాడన్నారు. అతడిని బయట తిరగనీయకుండా చేయాలని ప్రకాష్‌పై కర్ణాటక మద్యం తరలిస్తున్నట్లు కేసులు పెట్టారన్నారు. విజయవాడలో జరిగిన సమావేశంలో సర్పంచ్‌ల హక్కుల కోసం వెళ్లిన ప్రకాష్‌ను అక్కడ కూడా అరెస్టు చేశారన్నారు. అక్రమ కేసులు పెట్టినంత మాత్రాన టీడీపీ నాయకులు భయపడరని, దీనిపై చట్ట పరంగా, న్యాయస్థానంలో పోరాడుతామన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు, సీడ్ మల్లికార్జుననాయుడు, దొరస్వామినాయుడు, ఆర్‌జే వెంకటేశ్, గుత్తికొండ త్యాగరాజు, పెంచుపాడు స్వామి, తదితరులు పాల్గొన్నారు.

దేశాన్ని అగ్రగామిగా తీర్చిదిద్దడమే ధ్యేయం

కురబలకోట, మార్చి 1: ప్రపంచంలోనే ఆర్థికంగా మన దేశాన్ని అగ్రగామిగా తీర్చిదిద్దడమే ప్రధాని మోదీ ధ్యేయమని రాష్ట్ర బీజేపీ కో-ఆపరేటివ్ సెల్ కన్వీనర్ గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని అంగళ్ళులో ప్రజాపోరు యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల కోసం కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలుచేస్తోందన్నారు. రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందని దుయ్యబట్టా రు. రాబోవు ఎన్నికలలో వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపి బీజేపీకి పట్టం కట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రజాక్, మనోహర్ గౌడ్, చిన్నప్ప, జయరాం రెడ్డి, రవీంద్ర, గుణశేఖర్‌రెడ్డి, రాజారెడ్డి, రమేష్, శివయ్య తదితరులు పాల్గొన్నారు.


క్రీడాభివృద్ధితోనే దేశానికి గుర్తింపు

మదనపల్లె టౌన్, మార్చి 1: క్రీడాభివృద్ధితోనే దేశానికి తగిన గుర్తింపు వస్తోందని రిటైర్డ్ బ్రిగేడియర్, కలికిరి సీఏటీ స్కూల్ డీజీ అనుప్ ఎమ్‌శర్మ పేర్కొన్నారు. శుక్రవారం ఇంటర్నేషనల్ డిల్లీ పబ్లిక్ స్కూల్లో స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన అనుపమ్ శర్మ మాట్లాడుతూ గతంలో ప్రపంచ ఒలంపిక్స్‌లో భారతదేశానికి తక్కువ సంఖ్యలో మెడల్స్ వచ్చేవని, కాని ప్రభుత్వాలు క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం, క్రీడాకారులను ప్రోత్సహిస్తుండటంతో గత ఒలంపిక్స్‌లో ఎక్కువ మెడల్స్ సాధించి తలెత్తుకునేలా చేశారన్నారు.

అగ్నికి ఆహుతవుతున్న మల్లయ్యకొండ

తంబళ్లపల్లె, మార్చి 1: తంబళ్లపల్లెకు సమీపంలోని మల్లయ్యకొండ అటవీ ప్రాంతం అగ్నికి ఆహుతి అవుతున్నాయి. శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తులు అడవికి నిప్పు పెట్టడంతో అవి దావానంలా వ్యాపించాయి. దీంతో మల్లయ్యకొండ రోడ్డుకు తూర్పు వైపు ఉన్న ఎద్దుమీదిబోడు, మేకపోతుదొన, రెండు దొనాలపెంట తదితర ప్రాంతాలు సుమారు 400 హెక్టార్లకు పైగా అగ్నికి ఆహుతైనట్లు తెలుస్తోంది. వందల ఎకరాల్లో అడవి కాలిపోవటంతో పలు రకాల జాతులకు చెందిన వృక్ష సంపదతో పాటు వన్యప్రాణులు, పశుగ్రాసం, బోధ మంటలకు కాలి బూడిదైపోయింది. కొండ కింద వ్యవసాయ పొలాలున్న రైతులు తమ పొలాల్లోకి మంటలు రావడంతో ఆందోళన చెందారు. కొందరు రైతులు తీవ్రంగా శ్రమించి పొలాల్లోకి వచ్చిన మంటలను అదుపుచేశారు. కాగా, వారం రోజుల కిందట ఆకతాయిలు నిప్పుపెట్టడంతో మర్రికొండలో సుమారు 600 హెక్టార్లకు పైగా అగ్నికి ఆహుతైన విషయం తెలిసిందే. ఇప్పటికైనా అటవీశాఖాధికారులు అడవుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

దేవకమ్మకు ఉత్తమ ఎన్‌సీసీ అధికారిణి అవార్డు



అవార్డు అందుకుంటున్న దేవకమ్మ

మదనపల్లె అర్బన్, మార్చి1: స్థానిక జడ్పీహైస్కూల్‌లో వ్యాయామ ఉపాధ్యాయురాలుగా పని చేస్తున్న గుర్రం దేవకమ్మ ఉత్తమ ఎన్‌సీసీ అధికారిణి అవార్డును అందుకున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం సికింద్రాబాద్‌లోని ఎన్‌సీసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎంఎస్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు, ప్రశంసాపత్రం అందుకున్నారు. ఉత్తమ ఎన్‌సీసీ అధికారిణి అవార్డు పొందిన దేవకమ్మను ఎస్టీయూ రాష్ట్రనాయకులు ఆర్‌వీ రమణ, ఉపాధ్యాయులు పఠాన్ మహ్మద్‌ఖాన్, ముబారకబాషా, నాగరాజ, మిట్టపల్లె సుధాకర్‌రెడ్డి, పుణ్యవతి తదితరులు అభినందించారు.

హార్సిలీహిల్స్‌లో ప్రభుత్వ భూములను కాపాడాలి

● జేసీ ఫర్మాన్ అహమ్మద్‌ఖాన్‌కు ఏఐటీయూసీ నేతల వినతి



జేసీకి వినతి పత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

మదనపల్లె, మార్చి1: ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌లో ప్రభుత్వ భూములు, భవనాలు ప్రైవేటీకరణ మానుకుని హిల్స్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. 'పేదల ఊటీ..ఆస్తుల లూటీ' పేరుతో గురువారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం వెలువడిన నేపథ్యంలో ఏఐటీయూసీ నేతలు జిల్లా కేంద్రమైన రాయచోటికి వెళ్లి జేసీ ఫర్మాన్ అహమ్మద్‌ఖాన్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. హిల్స్‌లో విలువైన ప్రభుత్వ భూములు, భవనాలు ప్రైవేటు పరం చేస్తున్నారని, భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని వాటిని అరికట్టాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. అక్కడ విలువైన ఆస్తులను ప్రైవేటు పరం చేస్తూ, ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. హార్సిలీహిల్స్‌లో అక్రమంగా జరిగిన లీజులను రద్దు చేయాలని ప్రభుత్వ ఆస్తులను కాపాడటంతోపాటు పర్యాటలకు అన్ని సౌకర్యాలు కల్పించే విధంగా అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సి.శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి గంగాధర్, కోశాధికారి సలీంబాషా, ఉపాధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, సికింధర్, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వంతో ప్రజలకు ఒరిగింది శూన్యం



ఓబులంపల్లెలో టీడీపీ, జనసేన నాయకుల ఇంటింటి ప్రచారం దృశ్యం

వాల్మీకిపురం, మార్చి 1: గడచిన అయిదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్ర ప్రజలకు ఒరిగింది శూన్యమని వాల్మీకిపురం మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వాల్మీకిపురం గ్రామ పంచాయతీ పరిధిలోని ఓబులంపల్లె, దళితవాడ, శివపురం తదితర ప్రాంతాలలో బాబు షూరిటీ.. భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా టీడీపీ-జనసేన పార్టీల ఉమ్మడి మేనిఫెస్టో పథకాలపై ఇంటింటా కరపత్రాలు పంచుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో గ్రామీణ ప్రాంతాల ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. మాయ మాటలు చెప్పి మోసం చేసిన వైసీపీ ప్రభుత్వానికి ఎన్నికల్లో ఓటమి ఖాయమన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారం చేపట్టడం తథ్యమన్నారు. రానున్న 40రోజులు నాయకులు, కార్యకర్తలు చిత్తశుద్ధితో కృషి చేసి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డిని తప్పక గెలిపిం చుకుంటామన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ వల్లిగట్ల వెంకటరమణ, పీలేరు తెలుగు యువత ఉపాధ్యక్షుడు లంకిపల్లి మధు, జిల్లా పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటరమణ, టీడీపీ పీలేరు మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్ బాషా, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు కోసూరి రమేష్ నాయకులు పీవీ నారాయణ, చంద్రమౌళి, తెలుగు యువత చాను, కువైట్ సయ్యద్‌బాషా, అడ్వకేట్ రమణ, స్వర్ణలత, ఎండీ యూసుఫ్ ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శంకర్‌యాదవ్‌తో కలిసే పనిచేస్తాం

● పార్టీ మండలాధ్యక్షుల ప్రకటన

మదపనల్లె, మార్చి 1: తంబళ్లపల్లెలో తామంతా మాజీ ఎమ్మెల్యే జి.శంకర్‌యాదవ్‌తో కలిసి పనిచేస్తామని ఆయా మండలాల టీడీపీ అధ్యక్షులు ప్రకటించారు. స్థానిక సొసైటీ కాలనీలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆరు మండలాల నుంచి పార్టీ సీనియర్ నాయకులు, పార్టీ అనుబంధ విభాగాల నేతలు సమావేశమై అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే జి.శంకర్‌యాదవ్ ప్రతిపక్ష నాయకుడిగా అధికార పార్టీ నుంచి అనేక ఇబ్బందులు ఎదుర్కొని పార్టీని ముందుకు నడిపించారని తీరా ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో పార్టీకోసం పనిచేసిన వారికి కాకుండా కొత్తవారికి, అవకాశం కల్పించారని వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. శంకర్‌యాదవ్‌ను పార్టీ అభ్యర్థిగా ప్రకటిస్తే, తాము కలసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షులు వైజీ సురేంద్ర, బంగారు వెంకటరమణ, రెడ్డెప్పరెడ్డి, నారాయణస్వామిరెడ్డి, వెంకటరమణ, మార్కెట్‌కమిటీ మాజీచైర్మన్ శ్రీనాథ్‌రెడ్డి, నియోజకవర్గ పోల్‌మేనేజ్‌మెంట్ కో-ఆర్డినేటర్ కుడుం శ్రీనివాసులు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు ఈశ్వరప్ప, ఎస్సీసెల్ కార్యదర్శి శ్రీనివాసులు, రమణపూర్తి, రమణమూర్తి, నటరాజనాయక్, మనోహర్‌నాయక్, మాజీసర్పంచులు, యూనిట్ ఇన్‌చార్జులు, క్లస్టర్ ఇన్‌చార్జులు, తెలుగుయువత ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

పీలేరు, మార్చి 1: పీలేరులో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం పీలేరు, కేవీపల్లె మండలాల్లోని ఇంటర్ విద్యార్థుల కోసం ప్రభుత్వం పీలేరులోని రెండు ప్రైవేటు, మూడు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఐదు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసింది. వాటిలో 1276 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 1212 మంది హాజరయ్యారు. 64 మంది గైర్హాజరైనట్లు చీఫ్ కస్టోడియన్ బాలకృష్ణ తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద పీలేరు ఎస్ఐ నరసింహుడు నేతృత్వంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. అత్యవసర పరిస్థితుల కోసం వైద్యఆరోగ్య సిబ్బందిని నియమించారు.

మదనపల్లె అర్బన్: మదనపల్లెలో ఇంటర్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. పట్టణంలో 11 పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్ అమలు చేశారు. విద్యార్థులు తమ హాల్‌టిక్కెట్ నెంబర్లు పరీక్ష కేంద్రాల వద్ద పరిశీలించుకున్నారు. ఆ సమయంలో తమ తోపాటు తల్లిదండ్రులు పరీక్ష కేంద్రావద్ద రావడంతో సందడి నెలకొంది. పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

నిమ్మనపల్లిలో: స్థానిక జూనియర్ కళాశాలలో శుక్రవారం ఇంటర్ మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించినట్లు పరీక్షల చీఫ్ రాధాక్రిష్ణయ్య తెలిపారు. మొదటి సంవత్సరంలో 171మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి వుండగా 165 పరీక్షలు రాసినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144వ సెక్షన్‌ను అమలు చేసి ఎటువంటి సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు. డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా రెడ్డెప్పరెడ్డి వ్యవహరించారు.

వాల్మీకిపురంలో: వాల్మీకిపురంలో శుక్రవారం ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. పీవీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉర్దూ గురుకుల, జడ్పీ బాలికల కళాశాలలకు సంబంధించి పీవీసీ కళాశాల కేంద్రంగా మొత్తం 296మంది విద్యార్థులకు గాని 284మంది విద్యార్థులు పరీక్షలు రాయగా తొలిరోజు 12మంది గైర్హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఉమా అమరేశ్వరి తెలియజేశారు.

గుర్రంకొండలో: ఇంటర్ మొదటి సంవత్సర పరీక్షలు శుక్రవారం గుర్రంకొండలో ప్రశాంతంగా జరిగాయి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో తెలుగు, ఉర్దూ ప్రభుత్వ కాలేజీ విద్యార్థులు పరీక్షలు రాశారు. ఇందులో భాగంగా 215 మంది విద్యార్థులకు గాను 202 మంది హాజరైనట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గోపాల్‌నాయక్ తెలిపారు.

తంబళ్లపల్లెలో: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు తెలుగు, హిందీ పరీక్ష జరగ్గా 147 మంది విద్యార్థులకు గానూ141 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షను చీఫ్ ఎగ్జామినర్ సాయిశంకర్‌రెడ్డి, డీవో కిరణ్‌చంద్రకుమార్ పర్యవేక్షించారు. పరీక్షా కేంద్రం వద్ద పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

జేఎన్టీయూ ఇంజినీరింగ్ కాలేజీలకు న్యాక్ గుర్తింపు

కలికిరి, మార్చి 1: అనంతపురం జేఎన్టీయూ పరిధిలోని ఇంజినీరింగ్ కళాశాలలన్నింటికీ న్యాక్ గుర్తింపు లభించిందని స్థానిక ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర రావు తెలిపారు. గత నెల రోజులపాటు న్యాక్ నిపుణుల బృందం జేఎన్టీయూ పరిధిలోని కళాశాలల్లో అధ్యయనం పూర్తి చేసిన అనంతరం న్యాక్ గుర్తింపునకు మార్గం సుగమమైందన్నారు. విశ్వవిద్యాలయంతోపాటు దాని పరిధిలోని ఇంజినీరింగ్ కళాశాలల్లోని నాణ్యతా ప్రమాణాలను క్షుణ్ణంగా పరిశీలన జరిగిందని కళాశాలల్లోని పరిశుభ్రత, బోధన తీరుతెన్నులు, పరిశోధన విభాగాల పనితీరు, మౌలిక వసతులు వంటి అనేక అంశాలను పరిగణనలోకి తీసుకుని గుర్తింపు జారీ చేశారని ప్రిన్సిపాల్ వివరించారు. ఇందులో కూడా ఏ గ్రేడ్ గుర్తింపు లభించడం హర్షణీయమని తెలిపారు. న్యాక్ గ్రేడ్ గుర్తింపు రావడం వలన యూజీసీ నుంచి కళాశాలల అభివృద్ధి కోసం నిధులు పెరుగుతాయని విద్యార్థులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. కాగా న్యాక్ గుర్తింపు లభించడంతో వైస్ ప్రిన్సిపాల్ త్యాగరాజన్ హర్షం వ్యక్తం చేశారు.

అర్హులకే సిరికల్చర్ స్థలాలు కేటాయిస్తాం

మదనపల్లె టౌన్, మార్చి 1: మదనపల్లెలో సిరికల్చర్ కాలనీలోని 11 స్థలాలను మల్టీఎండ్ యూనిట్లు ఏర్పాటు చేసేందుకు అర్హులైన వారికే లీజు ప్రాతిపదికన మంజూరు చేస్తామని జిల్లా సిరికల్చర్ అధికారి రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద కొంత మందికి సిరికల్చర్ స్థలాలను లీజుకు ఇవ్వడానికి అగ్రిమెంట్ చేసేందుకు డీఎస్‌వో వచ్చారు. విషయం తెలుసుకున్న కొంత మంది రీలర్లు, బీవైఎస్ అధ్యక్షుడు పునీత్‌కుమార్ అక్కడికి వెళ్లి డీఎస్‌వోతో వాగ్వాదానికి దిగారు. మదనపల్లెలో చాలా మంది అర్హులైన రీలర్లు వున్నారని, వారి దరఖాస్తులు తీసుకోకుండా ఏకపక్షంగా వ్యవహించడం బాగోలేదన్నారు. ఎలాంటి పరిస్థితిలో అగ్రిమెంట్ రిజిస్ట్రేషన్ చేయడకూడదని కోరారు. దీనిపై డీఎస్‌వో మాట్లాడుతూ సిరికల్చర్ కమిషనర్ ఆదేశాల మేరకు దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను విచారించామన్నారు. ఇందులో ఇద్దరు మాత్రమే అనర్హులు వున్నారని, మిగిలిన వారికి స్థలాలను 10ఏళ్ల లీజుకు ఇచ్చేందుకు అగ్రిమెంట్ చేసేందుకు వచ్చామన్నారు. లీజుకు తీసుకున్న వారు ఐదు నెలల్లో షెడ్ల నిర్మాణం చేపట్టి, యంత్రాలను కొనుగోలు చేసి అమర్చాలన్నారు. అలా చేయని వారి లీజు అగ్రిమెంట్‌ను రద్దు చేస్తామన్నారు. దీనిపై ఎలాంటి అభ్యంతరాలు వున్నా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే, ఉన్నతాధికారులకు పంపి వారి సూచనలతో విచారించి, అర్హులైన వారికి సిరికల్చర్ యూనిట్లు ఏర్పాటుకు స్థలాలు కేటాయిస్తామన్నారు.

కాంగ్రెస్‌లో నయా జోష్

ప్రత్యేక హోదా నినాదాలతో మార్మోగిన ఎస్వీయూ స్టేడియం

కాంగ్రెస్ పార్టీలో నయా జోష్ కనిపించింది. పార్టీ శ్రేణుల్లో ఎక్కడలేని ఉత్సాహం వచ్చింది. సాధిద్దాం సాధిద్దాం...ప్రత్యేక హోదా సాధిద్దాం నినాదాలతో తిరుపతి లోని ఎస్వీయూ స్టేడియంలో శుక్రవారం సాయంత్రం జరిగిన ప్రత్యేక హోదా-న్యాయ సాధన సభ మార్మోగింది.కాంగ్రెస్‌తో పాటు సీపీఐ, సీపీఎం, ఆమ్‌ఆద్మీ పార్టీ జెండాలు సభలో రెపరెపలాడాయి. పీసీసీ చీఫ్ షర్మిల ప్రసంగం పట్ల శ్రేణులు ఉత్సాహంగా కనిపించారు. 'మోడీ-కేడీ' అంటూ సభికులతో చెప్పించడం, జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత మరిచిపోయాడంటూ 'రేవు దాటేంత వరకే ఓడ మల్లన్న, రేవు దాటిన తర్వాత బోడి మల్లన్న' సామెతను పలుమార్లు ఉటంకించడం, 'ఢిల్లీలో జగనన్న పిల్లి' అంటూ మాట్లాడిన సమయంలో కార్యకర్తలు చప్పట్లతో మారుమోగించారు.ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి సచిన్ పైలెట్, కేంద్ర మాజీ మంత్రులు చింతా మోహన్, పల్లంరాజు, మాజీ ఎంపీలు కేవీపీ రామచంద్రరావు, తులసిరెడ్డి,కనుమూరి బాపిరాజు,పీసీసీ మాజీ అధ్యక్షులు రఘువీరా రెడ్డి, గిడుగు రుద్రరాజు,మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తాంతియా కుమారి, ముఖ్య నాయకులు జేడీశీలం, మయ్యప్పన్, రాకేష్,సునీల,వేణుగోపాల రెడ్డి, మాగంటి గోపాల రెడ్డి, రాంభూపాల్ రెడ్డి, ప్రమీలమ్మ,చిత్తూరు జిల్లా అధ్యక్షుడు భాస్కర్, తిరుపతి జిల్లా అధ్యక్షుడు పంటా శ్రీనివాస రెడ్డి, తిరుపతి నగర అధ్యక్షుడు యార్లపల్లి గోపి, సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, రామానాయుడు, సీపీఎం నేత గఫూర్,ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు మణినాయుడు,నీరుగట్టు నగేష్, వెంకట చలపతి తదితరులు పాల్గొన్నారు.

- తిరుపతి(తిలక్‌రోడ్)







న్యాయ సాధన సభకు హాజరైన జనం మధ్య రెపరెపలాడుతున్న కాంగ్రెస్, వామపక్షాల పతాకాలు-వేదికపై కాంగ్రెస్ నాయకులతో సీపీఐ,సీపీఎం నేతలు నారాయణ, గఫూర్

మునికోటి ఆత్మాహుతికి మోదీ సమాధానమేంటి?

ప్రత్యేక హోదా కోసం 2015లో కాంగ్రెస్ కార్యకర్త మునికోటి తిరుపతిలో ఆత్మాహుతి చేసుకున్నాడు. ప్రధాని నరేంద్ర మోదీ ఆ కుటుంబానికి ఏమి సమాధానం చెబుతారు? ఈ రాష్ట్రానికి ఏమి చెబుతారు? తిరుపతి వెంకన్న సాక్షిగా ప్రత్యేక హోదా హామీ ఇచ్చిన మోదీ, వెంకన్నకే పంగనామాలు పెట్టాడు. నిజమైన భక్తులు ఇలా చేస్తారా? పదేళ్లపాటు ప్రత్యేక హోదా కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే ఇస్తాం.

- వైఎస్ షర్మిల, పీసీసీ చీఫ్



జగన్ ఢిల్లీలో ఎందుకు పోరాడరు?

కేరళ, కర్ణాటక రాష్ట్రాలకు కేంద్రప్రభుత్వం నిధులు ఇవ్వకపోతే అక్కడి నాయకులు ఢిల్లీకి వచ్చి పోరాడుతున్నారు. జగన్మోహన్ రెడ్డి అలా ఎందుకు పోరాటం చేయడంలేదు? కేవలం లోపాయికార ఒప్పందాలే ఇందుకు కారణం. ఈ విషయం ప్రజలందరూ గమనించాలి. దేశంలో బీజేపీపై పోరాటం చేస్తున్నది కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి మాత్రమే.

- సచిన్ పైలెట్, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి

దేవుడికే మోదీ పంగనామాలు



ప్రత్యేక హోదా కోసమే ఇండియా కూటమిలో చేరాం.హోదా కోసం ఏ పోరాటానికైనా కలిసి వస్తాం. దేశ ప్రజలకు భక్తితత్పరుడిగా కనిపించే మోదీ తిరుపతి దేవుడి సన్నిధిలో ఇచ్చిన మాటను తప్పి ఆ మూడు నామాల వాడికే పంగనామాలు పెట్టారు.బీజేపీ మతాన్ని ఆయుధంగా చేసుకుని విద్వేషాలను రెచ్చగొడుతూ దేశ విచ్ఛిన్నానికి పాటుపడుతోంది. కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ వారికే రాయితీలను ఇస్తూ ప్రభుత్వ ఆస్తులను అమ్మేస్తోంది. మత సామరస్యం కోసం ఇండియా కూటమితో కలిసి పనిచేస్తాం.

- గఫూర్, సీపీఎం నేత

వైఎస్ బొమ్మనే కనుమరుగు చేసిన జగన్



కేంద్ర హోంమంత్రిగా ఉన్న అమిత్‌షా గతంలో ఒక హత్య కేసు నుంచి బయటపడడానికి 12మందిని చంపాడు. వైఎస్ రాజశేఖర రెడ్డి బొమ్మతో అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి నేడు ఆయన ఫొటోనే కనుమరుగు చేశాడు. అధికారం కోసం వాడుకుని వదిలేయడం వైసీపీ, టీడీపీలకు పరిపాటిగా మారిపోయింది.కాబట్టే ఫ్యాన్, సైకిల్, కమలం గుర్తులను ఊరిబయట పడేయండి.

- నారాయణ,సీపీఐ జాతీయ కార్యదర్శి

దేశ రాజకీయాల్లో గొప్ప మలుపు



తిరుపతి సభలో మూడు జెండాల కలయిక దేశ,రాష్ట్ర రాజకీయాల్లో గొప్ప మలుపు.కాంగ్రెస్ పార్టీకి కమ్యూనిస్టులు దూరం కావడంతోనే బీజేపీ పదేళ్లగా కేంద్రంలో అధికారంలో వుంది.ఇలాంటి తప్పిదాలకు ఇక తావు ఇవ్వకూడదు. రాష్ట్రానికి ఏడుగురు ముఖ్యమంత్రులను అందించిన రాయలసీమ నేడు కరువు కాటకాలతో అల్లాడిపోతోంది. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ 130 స్థానాల్లో విజయం సాధిస్తుంది. షర్మిలే కాబోయే సీఎం.

- కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్

ముక్కంటీశుడికి పట్టు వస్త్రాల సమర్పణ



పట్టు వస్త్రాలు అందజేస్తున్న గురుప్రసాద్

శ్రీకాళహస్తి, మార్చి 1: మదనపల్లెలోని జ్ఞాన ప్రసూనాంబిక డిగ్రీ కళాశాల నిర్వాహకులు రాటకొండ గురుప్రసాద్ శ్రీకాళహస్తి ఆలయానికి పట్టు వస్త్రాలను సమర్పించారు. శుక్రవారం కుటుంబ సమేతంగా దర్శనం చేసుకున్న ఆయన అమ్మవారికి 9 పట్టుచీరలు, స్వామివారికి 9 పట్టు పంచెలు సమర్పించారు. వరుసగా 23వ సంవత్సరం పట్టు వస్త్రాలు సమర్పించడం ఎంతో మహద్భాగ్యంగా భావిస్తున్నామని ఆయన అన్నారు.

సార్వత్రిక ఎన్నికలకు ఏర్పాట్లు : కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ షన్మోహన్

చిత్తూరు (సెంట్రల్), మార్చి 1: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్, ఎన్నికల అధికారి షన్మోహన్ తెలిపారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా శుక్రవారం అమరావతి నుంచి కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎపిక్ కార్డుల జనరేషన్, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనతోపాటు ఈనెల 4 నుంచి సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వివరించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు, ఫిర్యాదుల పరిశీలన, 6,7,8 ఫారం పెండింగ్ పరిష్కారం చేసినట్లు తెలిపారు. అనంతరం జిల్లాలోని ఎన్నికల అధికారులకు పలు సూచనలిచ్చారు. ఎస్పీ జాషువా, ఏఎస్పీలు, డీఎస్పీలు, డీఆర్వో పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

సమీక్షలు - సమావేశాలు

జగనన్న వసతి దీవెన కింద రూ.20.54 కోట్లు జమ

చిత్తూరు (సెంట్రల్), మార్చి 1: జగనన్న వసతి దీవెన కింద జిల్లాలోని 29,407 మంది తల్లుల ఖాతాల్లో రూ.20.54 కోట్ల నగదు జమ చేశారు. నగదు జమ చేసే కార్యక్రమాన్ని శుక్రవారం కృష్ణా జిల్లా పామర్రులో సీఎం వర్చువల్‌గా ప్రారంభించగా, కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు వీక్షించారు. జిల్లాలో 2023 అక్టోబరు, నవంబరు, డిసెంబరు త్రైమాసానికి సంబంధించి జిల్లాలోని 32,427 మంది విద్యార్థులకు లబ్ధి చేకూర్చుతూ 29,407 మంది తల్లుల ఖాతాల్లో రూ.20.54 కోట్లను జమ చేశారు. ఎంపీ రెడ్డెప్ప, జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు, కలెక్టర్ షన్మోహన్, మేయర్ అముద, డీఆర్వో పుల్లయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

టెట్‌కు 648 మంది హాజరు

చిత్తూరు (సెంట్రల్), మార్చి 1: టెట్ పరీక్షల్లో భాగంగా నాల్గవ రోజైన శుక్రవారం జిల్లాలోని మూడు సెంటర్‌లో నిర్వహించిన పరీక్షలకు 648 మంది హాజరైనట్లు డీఈవో దేవరాజు తెలిపారు. మొత్తం 841 మంది అభ్యర్థులకుగాను 648 మంది హాజరవగా, 193 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. ఉదయం సెషన్‌లో 421 మందికిగాను 303 మంది హాజరవగా, 118 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌లో 420 మందికిగాను 345 మంది హాజరవగా, 75 మంది గైర్హాజరైనట్లు డీఈవో వివరించారు.

నేడు డయల్ యువర్ టీటీడీ ఈవో

తిరుమల,మార్చి1(ఆంధ్రజ్యోతి): తిరుమలలో శనివారం డయల్ యువర్ టీటీడీ ఈవో కార్యక్రమం నిర్వహించనున్నారు.అన్నమయ్య భవనంలో ఉదయం 9నుంచి 10గంటలవరకు నిర్వహించనున్న కార్యక్రమంలో భక్తులు తమ సందేహాలు, సూచనలు, సలహాలు, ఫిర్యాదులను ఈవో ధర్మారెడ్డి దృష్టికి తీసుకురావచ్చు. ఇందుకోసం 0877-2263261ను సంప్రదించాల్సి ఉంటుంది.

పాలిసెట్, ఏపీఆర్‌జేసీలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(విద్య), మార్చి 1: ఏపీ రాష్ట్రంలో 2024-25 విద్యా సంవత్సరానికి రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలు(ఇంటర్మీడియట్), పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఏపీఆర్‌జేసీ, పాలిసెట్ ప్రవేశపరీక్షలకు అర్హులైన విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు కోరుతున్నారని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, తిరుపతిలోని విశ్వం పోటీ పరీక్షల శిక్షణ కేంద్రం డైరెక్టర్ డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీల్లో ప్రవేశాల కోసం ఈ ఏడాది టెన్త్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు దరఖాస్తు చేయవచ్చని, ఈనెల 31వ తేదీతో దరఖాస్తు గడువు ముగుస్తుందని తెలిపారు. అలాగే డిప్లొమా పాలిటెక్నిక్ కోర్సుల కోసం నిర్వహించే పాలిసెట్‌కి ఏప్రిల్ 5వ తేదీతో దరఖాస్తు గడువు ముగియనుందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 86888 88802/03, 93999 76999 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

దరఖాస్తు గడువు, ప్రవేశపరీక్షల తేదీలు ఇలా..

క్రమసంఖ్య	ప్రవేశపరీక్ష	దరఖాస్తు గడువు	పరీక్ష నిర్వహించే తేదీ
1	ఏపీఆర్‌జేసీ	31-03-2024	25-04-2024
2	ఏపీపాలిసెట్	05-04-2024	27-04-2024

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించండి

ఈసీకి టీడీపీ నేతల లేఖ



మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, మార్చి 1: జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషన్ (ఈసీ)కి లేఖ రాసినట్లు టీడీపీ నేతలు తెలిపారు. శుక్రవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. జిల్లాలోని వైసీపీ నేతల వద్ద ఉన్న లైసెన్స్ ఆయుధాలు, అక్రమ ఆయుధాల్ని స్వాధీనం చేసుకోవాలని కోరారు. ప్రతి ఎన్నికల్లోనూ ఈ ఆయుధాలను ఉపయోగించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని చెప్పారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఆయుధాలను తక్షణం పోలీస్ స్టేషన్‌లో డిపాజిట్ చేయించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర అధికారప్రతినిధి సప్తగిరి ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, తెలుగుయువత రాష్ట్ర అధికారప్రతినిధి హేమాద్రి నాయుడు, నేతలు సురేష్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ తొత్తుల్లా ముగ్గురు సీఐలు

శ్రీకాళహస్తి టీడీపీ నాయకులపై అక్రమ రౌడీషీట్లు తెరుస్తున్నారు ● ఎస్పీకి పార్టీ నేతల ఫిర్యాదు



ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

తిరుపతి(నేరవిభాగం)/శ్రీకాళహస్తి, మార్చి 1: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ముగ్గురు సీఐలు వైసీపీ నాయకులకు కొమ్ముకాస్తూ టీడీపీ నాయకులపై అక్రమంగా కేసులు, రౌడీషీట్లు ఓపెన్ చేస్తున్నారు. పరిశీలించి చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు ఎస్పీ మలిక గర్గ్‌ను కోరారు.శుక్రవారం తిరుపతిలోని జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చిన టీడీపీ నాయకులు ఎస్పీని కలిశారు. పోలీసుల తీరు, అక్రమ కేసులు, రౌడీషీట్లు, వేధింపుల గురించి ఆమెకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. శ్రీకాళహస్తి పార్టీ సమన్వయకర్త బొజ్జల సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ... శ్రీకాళహస్తి రూరల్ సీఐ అజయ్‌కుమార్, తొట్టంబేడు సీఐ శ్రీహరి, ఏర్పేడు సీఐ మల్లిఖార్జున్ వైసీపీ కార్యకర్తల్లా పనిచేస్తున్నారని, టీడీపీ నాయకులపై అక్రమంగా కేసులు నమోదుచేయడమే కాకుండా రకరకాలుగా వేధిస్తున్నారన్నారు. ఏర్పేడు మండలంలో ఒకే కుటుంబానికి చెందిన పి. ధనుంజయులు నాయుడు (67), చిరంజీవులు నాయుడు (69), పి. నాగరాజనాయుడు (52)తో పాటు పి. శివశంకర్‌రెడ్డి (69), మల్లిఖార్జున నాయుడు (62), బాబునాయుడు (58), కామాక్షి (46)పై రౌడీషీట్లు తెరిచారన్నారు.అయితే ఆ విషయం వారెవరికీ పోలీసులు ముందస్తుగా తెలియజేయలేదని చెప్పారు. మరో 42 మందిపై రౌడీషీట్లు ఓపెన్ చేసేందుకు పోలీసులు ప్రణాళిక సిద్ధం చేసినట్లు తనకు సమాచారముందని వెల్లడించారు.మండల, క్లస్టర్ స్థాయిలో ప్రధానమైన నాయకులను విచారణ పేరుతో స్టేషన్లకు పిలుస్తున్నారన్నారు.అధికారులు బయటకు వెళ్లిపోతూ ఎటువంటి విచారణ లేకుండా స్టేషన్‌లోనే కూర్చోబెడుతున్నారని చెప్పారు. రోజు రాత్రి ఎప్పుడో సీఐ వచ్చేవరకు నాయకులు స్టేషన్‌లోనే ఉండిపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.ఎన్నికల వేళ పార్టీ ప్రధాన నాయకులు ప్రచార కార్యకలాపాల్లో పాల్గొనకుండా చేసేందుకే పోలీసులు ఇలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వీటన్నింటి గురించి ఎస్పీకి వివరించామని, ఎస్పీ సానుకూలంగా స్పందించడంతో పాటు దర్యాప్తుచేసి కేసులు, రౌడీషీట్లు అక్రమమని తేలితే తీసేస్తామని హామీ ఇచ్చారని సుధీర్‌రెడ్డి చెప్పారు.రాష్ట్రంలోని టీడీపీ నాయకులందరూ కూడా తమపై రహస్యంగా కేసులు నమోదుచేసి రౌడీషీట్లు ఏమైనా తెరిచారా అని చెక్ చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా నియోజకవర్గ ఇంచార్జిలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.టీడీపీ తిరుపతి నియోజకవర్గ ఇంచార్జి నరసింహయాదవ్, కోశాధికారి కంఠారమేష్,తెలుగు మహిళ అధ్యక్షురాలు చక్రాల ఉష,మీడియా ఇన్‌చార్జి శ్రీధర్‌వర్మ,శ్రీకాళహస్తి పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్ పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యంలో

పోలీసులు వైసీపీ తొత్తులుగా వ్యవహరిస్తూ తమ పార్టీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారని జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి కోట వినుత శుక్రవారం ఎస్పీకి వినతిపత్రం అందజేశారు.క్రియాశీలకంగా ఉన్న పార్టీ కార్యకర్తలను బలవంతంగా స్టేషన్‌కు తీసుకెళ్లి రౌడీషీటర్, బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నారన్నారు. ఇప్పటికే ఎమ్మెల్యే మధుసూదన రెడ్డి ఆదేశాలతో తన భర్త చంద్రబాబుపై 15 కేసులు పెట్టారని, ప్రతిపక్ష పార్టీలను అసభ్యపదజాలంతో దూషిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.జనసైనికులు గణేష్, చంద్రశేఖర్, శివకుమార్, బాలాజీ, రవి, చిరంజీవి పాల్గొన్నారు.